80 రోజులలో భూప్రదక్షిణ!

రాజా

రౌండ్ టేబిల్ చుట్టూ కూర్చొన్న అందరి ముఖాలలోకీ మరోసారి పరీక్షగా చూసి చేతిలోని పేకముక్కలను టేబిల్ పై జారవిడిచాడు మిస్టర్ చిదానందం. అందరి ముఖాలలో ఒక రకమైన ఎక్సైట్ మెంట్ కన్పిస్తోంది. నోట్లో వెలుగుతున్న చుట్ట చేతిలోకి మారగానే అతని పెదవులు రెండూ విడివడ్డాయి.

"వెల్ మై డియర్ ఫ్రెండ్స్! భూమార్గాన 80 రోజులలో నేను భూప్రదక్షిణ చేసివస్తాను. ఈ పందెంలో నా తరఫు వాటా ఇరవై లక్షలూ కాయటానికి సిద్ధంగా ఉన్నాను."

"గుడ్ మిస్టర్ చిదానందం. షరతుల విషయం మరో

సారి గుర్తు చేసుకో'' గంభీరంగా అన్నాడు ఫాదర్ డేవిడ్.

చిరునవ్వు నవ్వాడు చిదానందం.

"డియర్ ఫాదర్! నేను ఒకసారి ఒక నిర్ణయాని కంటూ వస్తే తిరిగిపోవటమంటూ ఉండదని మీకు తెలుసు."

"కాని ఈ లక్షణం ప్రతీ విషయంలోనూ అమలు పరచటం అసంభవం. అందులోనూ ఈ విషయంలో మరీ అసంభవం."

డేవిడ్ ముఖంలోకి సూటిగా చూసాడు చిదానందం. "మీ ఉద్దేశ్యం ఏమిటో స్పష్టంగా తెల్పండి" అన్నాడు సిగార్ పొగ రైలింజన్లా వదులుతూ.

"మై డియర్ చిదానందం! నువు లెక్క ప్రకారం సరిగ్గానే ప్రయాణం చెయ్యవచ్చు. కాని నీ దురదృష్టం కొద్దీ మధ్యలో ఏదైనా అవాంతరం ఏర్పడితే? ఎనభై రోజులు దాటి ఏ ఒక్క క్షణం ఆలస్యం చేసినా చేజేతులా ఇరవై లక్షల రూపాయలు వదులుకోవలసివస్తుంది."

"అలా ఎప్పటికీ జరగదు. ఖచ్చితంగా ఎనభై రోజు ల్లోనే తిరిగి బొంబాయి చేరుకొంటాను" గంభీరంగా పల్కాడు చిదానందం.

"అంత నమ్మకమా?" అడిగాడు సేట్ వ్యాస్‌చంద్ కొంచెం హేళనగా.

"అవును. నమ్మకమే. ఇండియన్ రైల్వేస్, రోధాట్, అలహాబాదుల మీదుగా ఉను రూట్‌లో ఇప్పుడు కూడా కొన్ని రైళ్ళు నడుపుతుండటంవలన కొన్ని గంటలు కలిసి వస్తోంది. డైలీ టెలిగ్రాఫ్ పత్రిక కట్టిన అంచనాను ఇక్కడినుంచి అన్వయించుకొని చూడండి.

బొంబాయినుంచి కలకత్తాకు రైలుపై 3 రోజులు, కలకత్తానుంచి హాంకాంగ్ కు స్టీమరుపై 13 రోజులు, హాంకాంగ్ నుంచి యొకొహామావరకూ షిప్ పై6రోజులు, ఇక్కడికి మొత్తం 22 రోజులు.

యొకొహామా నుంచి శాన్ ఫ్రాన్సిస్కోకు షిప్ పై 22 రోజులు, న్యూయార్క్ కు రైలుమీద 7 రోజులు, న్యూయార్కు నుండి లండన్ వరకూ స్టీమరు, రైలుపై కలిపి 9 రోజులు.

పోతే, మిగిలింది 20 రోజులు.

లండన్ నుంచి మౌంట్ సెనిస్, బ్రిండసీల మీదుగా సూయజ్ కాలవకు రైలు మోటర్ బోట్లపై 7 రోజులు, అక్కడినుంచి బొంబాయివరకూ స్టీమరుపై 13 రోజులు.

మొత్తం 80 రోజుల్లో భూప్రదక్షిణ."

"అవును. విమానాలలో కాకుండా ప్రయాణిస్తే ఈ అంచనా సరైనదే. కాని ఆచరణలో అసాధ్యం. ఎలాగంటే ప్రయాణంలో ఏ ఒక్కక్షణం తేడా వచ్చినా ఒకేచోట రోజుల తరబడి ఉండిపోవలసి వస్తుంది. పోతే తుఫాన్లూ, రైలు ప్రమాదాలూ, ఓడలు పాడైపోవటాలూ వగైరా..." నవ్వుతూ అన్నాడు ఫాదర్ డేవిడ్.

"అవన్నీ కలుపుకొనే!" ముక్కు లందుకొన్నాడు చిదానందం.

"అంటే ఏ రెడ్ ఇండియన్లో, అమెరికన్లో పట్టాలు పీకేసినా, రైలు ఆపేసి దోపిడీలు చేసేసినా, ట్రావెలర్స్ ని తాటవలిచేసినా నిక్షేపంగా యాత్ర సాగిస్తానంటారు" ఉక్రోషంగా అడిగాడు రమేష్ సిన్హా.

"అవును ఖచ్చితంగా సాగిస్తాను" అంటూ పేక ముక్కలు పడేసి షో అన్నాడు చిదానందం.

"సరే! మా నలుగురి తరఫునా కలసి తలో ఐదు లక్షలూ కాయటానికి సిద్ధంగా వున్నాం, మీరు ఎనభై రోజుల్లో భూప్రదక్షిణ చేయలేరని" చెక్ బుక్ పైకితీస్తూ అన్నాడు రాధాకృష్ణన్.

తను కూడా చెక్ బుక్ పైకితీసి 20 లక్షలకు చెక్ వ్రాసి టేబిల్ పై పడేస్తూ అన్నాడు చిదానందం తాపీగా.

"మిస్టర్ కృష్ణన్! బ్యాంక్ ఆఫ్ ఇండియాలోని నా ఎకౌంట్ లో వున్న పాతిక లక్షల్లో ఇరవై లక్షలకు చెక్ వ్రాసి మీ కిచ్చాను.

ఇవాళ అక్టోబరు 7వ తేదీ సోమవారం. తిరిగి నేను డిసెంబరు 24, బుధవారం రాత్రి 9 గం॥ 13 ని॥ 26 సెకండ్ల లోపల లయన్స్ క్లబ్ లోని ఈ గదిలో వుంటాను. ఏ ఒక్క క్షణం ఆలశ్యమైనా బ్యాంక్ ఆఫ్ ఇండియాలో నా పేరునున్న 20 లక్షలూ మీకు చెందుతాయి."

మరో అయిదు నిముషాల్లో ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసారు ఐదుగురూ.

"ఒక్క క్షణం ఆలోచించు మై డియర్ ఫ్రెండ్. గడువు దాటకుండా వుండాలంటే, క్షణాల ప్రకారం నువ్వు రైళ్ళపైనుండి ఓడల మీదికి, ఓడలమీదనుండి రైళ్ళ పైకీ పరుగెత్తి అందుకోవాలి" అన్నాడు ఫాదర్.

నవ్వాడు చిదానందం చిన్నగా.

"అలాగే పరుగులు తీస్తూ భూప్రదక్షిణను 80 రోజుల్లోగాని, అంతకు లోపుగాగాని పూర్తిచేస్తాను ఫాదర్" వాచీ చూసుకుంటూ అన్నాడు.

"వెల్ మిస్టర్ చిదానందం. ఇక మీరు ఇంటికి వెళ్ళి ప్రయాణానికి కావలసిన ఏర్పాట్లు చేసుకోండి" అన్నాడు కుర్చీలో వెనక్కి వాలుతూ రమేష్‌సిన్హా.

"ఓ. కె. మైడియర్ ఫ్రెండ్స్. బొంబాయి నుంచి కలకత్తాకు వెళ్ళే ఎక్స్‌ప్రెస్ రాత్రి పదకొండూ ముప్పై అయిదు కుంది. పదకొండున్నరకల్లా ఎనిమిదో నెంబరు ప్లాట్‌ఫారంపై మిమ్మల్ని కలుసుకొంటాను. గుడ్‌బై అండ్ గుడ్‌నైట్" అంటూ లేచి బైటకు వచ్చి కారెక్కాడు చిదానందం.

కారు వేగంగా బ్యాంకు ఆఫ్ ఇండియా వైపు పరుగులు తీసింది.

2

చిదానందం బ్యాంకులోంచి ఐదులక్షలు విత్‌డ్రా చేసి ప్రపంచ యాత్రకు కావలసిన పాస్‌పోర్ట్సు అవీ తీసుకొని ఇంటికి చేరుకొనేసరికి పావు తక్కువ పదైంది. రాగానే తనకున్న ఒక్కగానొక్క నౌకరు భాషీరను పేరుపెట్టి నెమ్మదిగా పిల్చాడు.

ఇక్కడ చిదానందం గురించి కొద్దిగా చెప్పాలి.

ముప్పై తొమ్మిది దాటి నలభైలో పడుతోన్న చిదానందం వెనక ఎవరూ లేకపోయినా కొన్ని లక్షల విలువ చేసే ఆస్తిమాత్రం వుంది. బొంబాయి నగరంలో అతని వ్యక్తిత్వం ప్రసాదించిన పెద్ద మనిషత్వం అతన్ని ఎంతో విలువైన లయన్సు క్లబ్బులో సభ్యుడినిచేసి పెట్టింది.

సాధారణంగా ఎనిమిది గంటలకల్లా టిఫెన్ కాఫీ కానిచ్చి క్లబ్బుకు వెళ్ళే చిదానందం తిరిగి రాత్రి ఏ పది గంటలకో ఇంటికి చేరుకొని భోజనం చేస్తాడు. మర్నాడు ఉదయాన్నే ఎనిమిది గంటలకు లయన్సు క్లబ్బులో హాజరు. అందులో సభ్యులందరూ లక్షాధికారులే కావటం వలన కాలం గడవటానికి లోటేమీ వుండదు.

నిజం చెప్పాలంటే చిదానందంది విచిత్రమైన మన స్తత్వం. ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడడు. చేసే పనే దైనా మనస్సు లగ్నంచేసి పూర్తి కానిస్తాడు.

పైకి అమాయకుడిలా కన్పించే అతనికి తెలియని విషయ మంటూ ఏదీ లేదనిపిస్తుంటుంది ఒక్కోసారి అతని మిత్రు లకి. ప్రపంచంలో ఎక్కడేముందో ఖచ్చితంగా చెప్ప గలడు, అతను చెప్పే ఏ విషయాన్ని విన్నా అతను ఆ విషయాన్ని కూలంకషంగా పరిశీలించి థీసెస్ వ్రాసే డేమోననిపిస్తుంది వినే వాళ్ళకి.

అతనికున్న ఒకే ఒక వ్యసనం పేకాట. ఉదయం ఎనిమిది గంటలకు అతనికోసం ప్రత్యేకించిన ఆ టేబిల్ చుట్టూ అతనూ, అతని మిత్రులు నలుగురూ చేరుతారు. అప్పుడు ప్రారంభమైన ఆ ఆట రాత్రి ఏ పది గంటలకో ముగుస్తుంది. మధ్యలో వారి భోజనాలు ఆ క్లబ్బులోనే.

రాత్రి తన యజమాని పిలిస్తే మామూలుగా లోనికి వెళ్ళాడు భాషీర. ఆ క్షణంలో అతనికి తెలీదు కొద్ది గంటల్లో ఈ దేశాన్ని వదిలి ప్రపంచ యాత్రకు బయలుదేర బోతున్నామనే విషయం.

"కమాన్ భాషీరా! మనం కొద్దిసేపట్లో రోడ్డు మీదుగా అహమ్మదాబాదు వెళ్ళి, అక్కడినుంచి కలకత్తా వెళ్ళబోతున్నాం" అన్నాడు చిదానందం చుట్ట వెలిగిస్తూ భాషీర గదిలోకి రావటం చూసి.

భాషీర కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి. సాధార ణంగా ఎక్కడికీ కదలని తన యజమాని కలకత్తా వెళ్దా మంటోంటే భాషీరకు అద్భుతం అనిపించింది.

"బాబుగారు ఎక్కడికో ప్రయాణమవుతున్నారను

కొంటాను?" అడిగాడు నెమ్మదిగా.

"అవును. మనం భూప్రదక్షిణ చెయ్యబోతున్నాం," అన్నాడు చిదానందం. ఈ మాట వినగానే భాషీరకు ఆశ్చర్యంతో ఊపిరాడలేదు.

"ప్రపంచ ప్రదక్షిణా?"

"ఎనభై రోజుల్లో... వెంటనే బయలుదేరాలి."

"మరి సామాన్లు?"

"అక్కరలేదు. ఒక కార్పెట్ సంచి చాలు. నాకు జత బట్టలూ, రెండుజతల మేజోళ్ళూ, అలాగే నీకూ సర్దు, కావలసినవి దారిలో కొనుక్కోవచ్చు. మెళ్లో చుట్టుకొనే మా కిన్ టోష్, ప్రయాణాల్లో పనికివచ్చే ఓవర్ క్లోక్ పట్టుకురా. త్వరగా కానీ... వెళ్ళు" పురమాయించాడు చిదానందం.

ఉత్సాహంతో తబ్బిబ్బులౌతూ రెండు నిముషాల్లో బాగ్ సర్దేశాడు భాషీర.

ఆలోగా చిదానందం ప్రయాణానికి సిధమయ్యాడు. అతని చేతిలో 'యూరప్'లో రైళ్లు, ఓడలు కాలగమనాన్ని తెలిపే 'బ్రాడ్‌షా గైడ్' ఉంది.

భాషీర రాగానే అతని చేతిలోని కార్పెట్ బాగ్ అందుకొని ఓ పెద్ద నోట్లకట్ట దాచాడు. ఆ నోట్లు ప్రపంచమంతా చలామణీ అయ్యే బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌వి.

"ఏమీ మరువలేదుగా?" అడిగాడు.

"లేదండీ."

"మరి నా మాంకి టోష్ ఓవర్ క్లోక్?"

"ఇదిగో, ఇక్కడ!" అందించాడు భాషీర.

"గుడ్, ఇదిగో బాగ్. చాలా జాగ్రత్తగా ఉండాలి.

ఇందులో అయిదు లక్షల రూపాయలు విలువచేసే ఇండియన్, ఇంగ్లాండ్ నోట్లున్నాయి'' అన్నాడు చిదానందం బాగ్ అందిస్తూ.

భాషీరకు స్పృహ తప్పినంత పనైంది. అకస్మాత్తుగా చేతిలోని బాగ్ మోయలేనంత బరువైనట్లు అన్పించింది. అతను తేరుకొనేసరికి ఇంటికి తాళాలు వేసి బయటకు నడిచారు.

ఐదు నిముషాల తర్వాత వారెక్కిన టాక్సీ బొంబాయి సెంట్రల్ స్టేషన్ ముందాగింది. ఫేర్ చెల్లించి లోనికి నడిచాడు చిదానందం. భాషీర టాక్సీలోంచి దూకి స్టేషన్లో ప్రవేశించబోతున్న తన యజమానిని అనుసరించాడు.

కలకత్తాకు రెండు మొదటి టికెట్లు తీసుకొని ప్లాట్ ఫారంపైకి వెళ్ళాడు చిదానందం. అతని మిత్రులు నలుగురూ ప్రత్యక్షమయ్యారు.

"నేను ఈ బండిలో బయలుదేరటం మీరు చూస్తూనే ఉన్నారు. నేను తిరిగి రాగానే నా పాస్‌పోర్టు పరిశీలిస్తే నేను ప్రపంచమంతా పర్యటించినట్లు ఋజువుగా నేను ప్రతీ రేవులోనూ నా పాస్‌పోర్టుపై సంతకం చేయిస్తాను. శలవు'' అన్నాడు.

నలుగురూ తలలూపారు.

చిదానందం, భాషీర పదకొండు గంటల ముప్పైనాలుగు నిమిషాలయ్యేసరికి తమ సీట్లలో కూర్చొన్నారు. మరో అరనిముషంలో రైలు బయలుదేరి నెమ్మదిగా ప్లాట్ ఫారం వదిలి కళ్యాణ్ జంక్షన్ వైపు పరుగులు తీసింది.

3

ఆ మొదటి తరగతి కంపార్ట్‌మెంట్‌లో చిదానందం, భాఘీరా కాక చాలామంది ప్రయాణీకులున్నారు. వారందరిలో చిదానందంని ఆకర్షించిన వ్యక్తి ఒక్కడే. అతను బ్రిగేడియర్ విక్రమ్. చిదానందంకి అతనితో పరిచయం చేసుకోడానికి ఎక్కువ సమయం పట్టలేదు. కారణం అతని కూడా చిదానందంలా పేకాటంటే పిచ్చి. ఇద్దరూ కొద్దిసేపట్లోనే విస్ట్‌లో పడిపోయారు.

భాఘీర బాగ్‌ని ఒళ్ళో గట్టిగా పట్టుకొని ఇండియన్ రైల్వే టైమింగ్స్‌కు చెందిన రైల్వే గైడ్ తెరిచాడు. బొంబాయినుంచి కలకత్తా వెళ్ళే ఆ రైలుమార్గం ఇలా పోతుంది.

బొంబాయినుంచి 'సాల్సెట్' మీదుగా 'థాణా' వెళ్ళి, దానికి ఎదురుగా ప్రధాన భూభాగంలోనికి ప్రవేశిస్తుంది. అక్కడినుంచి పడమటి కనుమలు దాటి ఈశాన్య ముఖంగా 'బర్హాంపూర్' చేరి 'బుందేల్ ఖండ్' మీదుగా 'అలహాబాదు' వరకూ వెళుతుంది. తర్వాత తూర్పుకు తిరిగి 'బెనారస్' దగ్గర గంగను దాటి కొంచెం ప్రక్కకు తిరిగి 'బరద్వాన్, చంద్రనాగూర్'ల మీదుగా కలకత్తా చేరుకుంటుంది.

ఆ రైలు వెళ్తోన్న వేగం చూస్తోంటే అది తమని మూడురోజులకంటే ముందే అడంగు చేరుస్తుందనే నమ్మకం కలుగుతున్నా భాఘీరకు ఒక అనుమానం పీకుతోంది. థాణా దాటింతర్వాతినుంచీ బర్హాంపూర్‌దాకా రైలుమార్గం అంతా చాలా ప్రమాదభరితమైన కొండ గుహల్లోంచి పోతుంది. తమ ప్రాణానికి ఏ పెద్ద యాక్సి

డెంటో జరగక్కరలేదు. ఖర్మగాలి ఏ కొండరాయన్నా పట్టాల కడ్డంపడితే చాలు, తమ ప్రయాణం ఆదిలోనే బెడిసికొట్టడానికి.

అయినా తనెంతో తెలివైనవాడనుకొనే తన యజమాని ఇంత తెలివితక్కువగా పందానికి ఎలా సిద్ధపడ్డాడో అర్థం కాలేదు.

గట్టిగా కూతపెడుతూ రైలు మరింత వేగాన్ని పుంజుకొంది.

చిదానందం ఆట మధ్యలో తాను భూప్రదక్షిణ చేస్తున్నట్లూ, ఏయే పరిస్థితులలో పందెం కట్టిందీ బ్రిగేడియర్‌కు వివరంగా తెలిపాడు. అంతా విన్న విక్రమ్ ఒక్కక్షణం తెల్లబోయాడు. నిజంగా ఈ వ్యక్తికి మతి స్థిమితం వుందా అన్పించిం దతనికి.

బొంబాయి వదిలిన ఒకగంట తర్వాత రైలు సాల్సెట్ దీవి దాటి ఒక మైదానంలో ప్రవేశించింది. కళ్యాణ్ జంక్షన్ తర్వాత ఖండ్లా, పూనాలమీదుగా ఆగ్నేయ భారతానికి పోయే దారి వదిలేసింది. దట్టమైన అడవుల మధ్యనుంచి రాళ్ళ గుహల్లో చీకటిని చీల్చుకొంటూ వేగంగా దూసుకెళ్తోంది.

చిదానందం, బ్రిగేడియర్ విక్రమ్ మధ్యమధ్య ఏదో మాట్లాడుకొంటూ విస్ట్ సాగిస్తోన్నారు. ఉన్నట్లుండి బ్రిగేడియర్ సంభాషణ ప్రారంభించాడు.

"ఏది యేమైనా మీరు 80 రోజుల్లో పృథ్విని చుట్టాలనుకోవటం అంత తెలివైన పనిగా నాకు తోచటంలేదు."

"ఎందుకనిః?" విస్ట్‌పైనుంచి దృష్టి మరలిస్తూ అడిగాడు చిదానందం.

"ఆకాశంలో ప్రయాణమంటే అది వేరే విషయం. 80 రోజుల్లో కాదు, ఎనిమిదిరోజుల్లో ప్రపంచాన్ని చుట్టి రావచ్చు. కాని ఇది నేలపై ప్రయాణం. ఈ రైలు అను కొన్న టైముకి ఖచ్చితంగా చేరుకోకుండా ఏ ఒక్క క్షణం ఆలశ్యమైనా హాంకాంగుకు వెళ్ళే స్టీమరు మీ కందదు. ఒక వేళ ఆ స్టీమరు అందుకొన్నా రనుకొందాం. ఆపైనా? సముద్రంపై ప్రయాణంలో ఏ క్షణం ఏం జరుగుతుందో ఆ భగవంతుడికే తెలీదు. షిప్ నుంచి మరో షిప్‌కు చేరుకొనే లోగా ఏ కాస్త తేడా వచ్చినా రోజుల తరబడి మీరా హార్బర్‌లో దిగబడి పోవలసిందే కదా?"

చిరునవ్వు నవ్వాడు చిదానందం.

"మై డియర్ బ్రిగేడియర్. నా అంచనాలపై నాకు ఖచ్చితమైన నమ్మకం వుంది. ఈ బ్రాడ్ షా గైడ్ నన్నెప్పుడూ మోసం చెయ్యదు."

అంత ఖచ్చితమైన విశ్వాసం గల వ్యక్తికి ఠ నేం చెబుతాడు. అందుకే నోర్మూసుకొని విస్ట్‌లో పడ్డాడు బ్రిగేడియర్ విక్రమ్.

ఆ రాత్రి రైలు కనుమలన్నీ దాటి నాసిక్ చేరి మరు నాడు అంటే అక్టోబరు 7 వ తేదీన సూర్యుడు ఉదయించే సరికి ఖాందేష్‌లో మైదానాలకు అడ్డంపడి పరిగెత్తుతోంది. విశాలమైన మైదానాలు, పచ్చని పంట పొలాలూ, వాటి మధ్య చిన్న చిన్న పల్లెలూ, పల్లెల్లో ఠీవిగా, ఎత్తుగావుండే గుడిగోపురాలూ కంటి కింపుగా కన్పిస్తోన్నాయి.

భాషీర నిద్రలేచి బైటకి చూసేసరికి ప్రత్తి, లవంగం, పోక తోటలగుండా రైలు చకచకా పోతోంది. సమయం గడిచేకొద్దీ రైలు తోటలను దాటి దట్టమైన అరణ్యాలలో ప్రవేశించింది.

ఉదయం పదకొండు గంటలకల్లా రైలు బర్హాంపురం చేరుకొని తిరిగి బయలుదేరి తపతి వడ్డున ఒకసారి ఆగి, తర్వాత సరాసరి అసుర్ ఘర్‌కు చేరుకొంది. ఆ సాయం త్రానికి రైలు సాత్పురా పర్వతగుహలను దాటి అరగంట తర్వాత పెద్ద కుదుపుతో ఆగిపోయింది.

పరధ్యానంగా అడుతోన్న బ్రిగేడియర్ విసురుగా వెళ్ళి ఎదురు సీటుకి గుద్దుకొన్నాడు. బైటకి చూస్తోన్న భాఘీర కుర్చీలోంచి క్రిందకి దొర్లిపడ్డాడు.

4

ఐదు నిముషాల్లో భాఘీర బయటకెళ్ళి రైల్వే గార్డును లాక్కొచ్చాడు.

"ఏం జరిగింది? రైలెందుకు ఆగిపోయింది?" అడిగాడు బ్రిగేడియర్ విక్రమ్.

"యాక్సిడెంట్ సార్! దూరంగా పట్టాల మధ్య బిగించబడే ఫిష్ ప్లేట్లు ఊడిపోయి ఉండటం పసిగట్టిన డ్రైవరు సడన్ బ్రేక్ వేశాడు. కాని ఆ వేగానికి బ్రేక్స్ వెంటనే పడక ఇంజన్ ముందుకుపోయి పట్టాలు తప్పింది" సంజాయిషీ ఇచ్చుకొంటున్నట్లు చెప్పాడు గార్డు. భాఘీర ముఖంలో ప్రేతకళ పడింది.

"వెంటనే బాగుపడే అవకాశం ఉందా?" అడిగాడు బ్రిగేడియర్.

"నో సర్! నలభై మైళ్ళ దూరంలో వున్న అలహా బాదునుంచి క్రేన్స్ వచ్చి ఇసుకలో కూరుకుపోయిన ఇంజన్‌ను తిరిగి పట్టాలమీదకు చేర్చేదాకా కదిలే అవ కాశం లేదు."

"మై గాడ్...ఇండియన్ రైల్వేస్ ఇలా ఏడుస్తున్నా యేమిటి?" తిడుతున్నాడు విక్రమ్.

"మిస్టర్ గార్డ్! ప్రస్తుతం మనమెక్కడున్నామో చెప్పగలరా?" సిగార్ పొగ వదులుతూ అప్పటివరకూ మౌనంగా ఉన్న చిదానందం అడిగాడు.

అతని ముఖంలో ఏమాత్రం కలవరం కాని విసుగు కోపంగాని కన్పించటంలేదు. భాషీర అవకాశం దొరికితే గార్డు పీక పిసికెయ్యాలన్నంత క్రోధంగా చూస్తోన్నాడు. అతని కళ్ళముందు ఇరవై లక్షల రూపాయల నోట్లకట్టలు కదులుతున్నాయి.

"ఖోల్చి గూడానికి అరమైలు దూరంలో!" అన్నాడు గార్డు. చిదానందం విక్రమ్ వైపు తిరిగాడు.

"డియర్ విక్రమ్. దయచేసి ముందిక్కడి నుంచి అలహాబాదు వెళ్ళే సాధనం సంగతి చూస్తే మంచిది. రండి పోదాం" అన్నాడు నెమ్మదిగా.

"మిస్టర్ చిదానందం. ఈ ఆలశ్యం మీ యాత్రమీద ఎంత ప్రభావాన్ని చూపిస్తుందో ఆలోచించారా?"

"ఫరవాలేదు. నేను ముందే జాగ్రత్త పడ్డాను."

"వాట్? ఇక్కడ యాక్సిడెంట్ జరుగుతుందని మీకు ముందే___?

"తెలీదు. కాని ఏదో జరుగుతుందని మాత్రం ఊహించాను. పోతే ఈ రైలు లెక్క ప్రకారం రెండో రోజు ఉదయం ఆరుగంటలకు అలహాబాదు చేరవలసి వుంది. కాని ఇవాళ సాయంత్రం దరిదాపుల కొచ్చేసింది అంటే దాదాపు పదకొండు గంటలు ఆదా అయిందన్నమాట. ఈ పదకొండు గంటల్లో నలభై మైళ్ళూ నడిచి అలహాబాదు చేరుకొంటే అక్కడినుంచి కలకత్తా వెళ్ళే రైలు కావలసినన్ని దొరుకుతాయి" అన్నాడు చిదానందం నెమ్మదిగా ముందుకి కదులుతూ.

అప్పటికే సగంమంది ప్రయాణీకులు రైలును వదిలి ఖోల్చి గూడెం వైపు సాగిపోయారు.

అంత ఖచ్చితంగా లెక్కలు చెప్పే చిదానందంతో ఏం మాట్లాడాలో అర్థంగాక నోర్మూసుకొని అనుసరించాడు బ్రిగేడియర్. వెంట వస్తున్న భాషీర మాత్రం రైల్వేలపై తన మనస్సులో వున్న కోపాన్నంతా తిట్ల రూపంలో ప్రయోగిస్తున్నాడు.

ఖోల్చి గూడెం చేరుకొనేసరికి అరయిపోయింది. అప్పటికే ఆ ఊళ్ళోని వాహనాలన్నీ ప్రయాణీకులతో అహమ్మదాబాదుకు కదిలి వెళ్ళిపోయాయి. చిదానందం కేదీ దొరకలేదు.

ఐదు నిముషాల్లో ఊరంతా వెదికి వచ్చేసాడు భాషీర.

"నేను నడిచి వెళ్తాను!" అన్నాడు చిదానందం మరో సిగార్ వెలిగిస్తూ. అతని సహచరు లిద్దరూ గతుక్కుమన్నారు.

"నాకో వాహనం కన్పించిందండీ!"అన్నాడు భాషీర తటపటాయిస్తూ.

"ఏమిటది? చెప్పు!"

"ఏనుగండీ! ఈ ప్రక్క వీధిలో ఒక వ్యక్తి దగ్గర ఉన్నదట."

"వెళ్దాం పదండీ!" అన్నాడు చిదానందం.

రెండు నిముషాల్లో ముగ్గురూ అక్కడికి చేరుకొన్నారు. బాగా మదించి పర్వతంలా వున్న ఆ ఏనుగు పేరు కిమోనీ అని చిదానందం తెలుసుకొన్నాడు.

వెళ్ళగానే ఏనుగు యజమానిని పిల్చి సూటిగా అడిగేసాడు చిదానందం అసలు విషయాన్ని. అంతా విన్న యజమాని మొహమాటం లేకుండా తల అడ్డంగా

త్రిప్పాడు ఇవ్వనంటూ.

పట్టుబట్టి పదిసార్లు అడిగాడు చిదానందం కావలసినంత కిరాయి ఇస్తానన్నాడు.

"గంటకి పదిరూపాయలు తీసుకో..."

"అబ్బే ... వద్దండీ..."

"పోనీ ఇరవై?"

"అక్కర లేదు."

"యాభై రూపాయలు తీసుకొని ఇవ్వు?"

సమాధానం లేదు.

చిదానందంకు చిరాకు పెరుగుతోంది.

"పోనీ కొనేస్తాం. అమ్ముతావా?" అడిగాడు చుట్ట కొసను పళ్ళమధ్య కొరుకుతూ.

"ఐదు వేలిస్తాను, ఇచ్చేయి."

"చెప్పాను కదండీ అమ్మనని..."

చిదానందం బేరం పెట్టసాగాడు.

"పదివేలు..."

"పదిహేను వేలు..."

విసుగెత్తి పోయింది చిదానందంకి. నోట్లోని చుట్ట విసిరి కొడుతూ అన్నాడు.

"చివరిసారిగా అడుగుతున్నాను. పాతిక వేలిస్తాను. ఇచ్చెయ్యి!"

భాఘీరథ, బ్రిగేడియర్ తెల్లబోతున్నారు. "మిస్టర్ చిదానందం... కొంచెం ఆలోచించుకొని అడగండి" అన్నాడు హెచ్చరింపు ధోరణిలో విక్రమ్.

బలంగా తల విదిలించాడు చిదానందం. "నేనంతా ఆలోచించే మాట్లాడుతున్నాను మై డియర్ విక్రమ్."

ఏనుగు యజమాని ఆ రేటుకు ఒప్పుకొన్నాడు. అతనికి ఆనందాశ్చర్యాలలో మూర్ఛబోతున్నట్లు తోచింది.

భాషీర చేతిలోంచి బాగ్ అందుకొని పాతిక వేలు లెక్క పెట్టి ఇచ్చాడు చిదానందం.

"మంచిది. ఏనుగు ఈ క్షణంనుంచీ మీది" నోట్లందు కొని కిమోనీని అప్పగించాడు.

'నలభై మైళ్ళ ప్రయాణానికి పాతిక వేలు ఖర్చు పెట్టిన చిదానందం మనిషా? లేక మరేదైనానా?' అని ఆలోచిస్తున్నాడు బ్రిగేడియర్ విక్రమ్.

ఊళ్ళోకి వెళ్ళి రెండు నిముషాల్లో ఒక పార్శీ యువకుడిని మావటీడుగ లాక్కొచ్చాడు భాషీర. త్వరగా అలహాబాదు చేరిస్తే ఒక పెద్ద మొత్తం బహుమతిగా ఇస్తానని ఆశ చూపాడు చిదానందం.

పార్శీ యువకుడు ఏనుగుమీద అంబారీ కట్టి దుప్పటి పరిచాడు. తర్వాత వీపుకు అటూ ఇటూ రెండు మెత్తలు అమర్చాడు.

చిదానందం, బ్రిగేడియర్ రెండు మెత్తల పైకీ ఎక్కి కూర్చున్నారు. ఇద్దరి మధ్యా ఏనుగు వీపుమీద భాషీర కూర్చున్నాడు.

గ్రామంలోకి వెళ్ళి భోజనాలు చేసి ఏడుగంటలకల్లా అలహాబాదు బయలుదేరారు.

5

ఉదయం ఐదు గంటలకు కిమోనీతో కలిసి చిదానందం బృందం అలహాబాదు రైల్వేస్టేషన్ చేరుకొంది. కలకత్తా వెళ్ళే రైలొకటి మరో గంటం పావులో ఉందని తెలియగానే భాషీర గుండెలు కుదుటపడ్డాయి.

చిదానందం నడిగి భాషీర ఊళ్ళోకి బయలుదేరాడు. వాతావరణం చాలా చల్లగా వుంది. గంట తర్వాత తనకు

కావలసిన వస్తువులు కొన్ని కొనుక్కొని కూనిరాగం తీసుకొంటూ స్టేషన్‌కు చేరుకొన్నాడు.

ఆ సరికే ప్లాట్‌ఫారం అంతా సందడిగా వుంది. కలకత్తా వెళ్ళే రైలు ప్లాట్‌ఫారం పైకొచ్చి వుంది.

చిదానందం, బ్రిగేడియర్‌లు భాఫీర కోసం ఎదురు చూస్తోన్నారు. భాఫీర రాగానే మావటీడుకు ఇవ్వవలసిన సొమ్ము పూర్తిగా చెల్లించేసాడు.

“పార్కీ! నువ్వు చేసిన సహాయం నా జీవితంలో మరువలేను. నేను నువ్వు చేసిన పనికిమాత్రం కిరాయి ఇచ్చాను, కాని నీ సహాయానికి మాత్రం కాదు. నీవా ఏనుగు తీసేసుకో! ఇకనుంచి అది నీదే!” అన్నాడు.

పార్కీ యువకుడు కళ్ళు ఆనందంతో మిలమిలలాడాయి. “దొరగారి ఋణం జీవితంలో తీర్చుకోలేను” అన్నాడు వినయంగా ఒంగి నమస్కరిస్తూ.

అతడు వెళ్ళి కిమోనీ ముఖంపై ముద్దుపెట్టుకొన్నాడు. అతన్ని పైకెత్తి తన వీపుమీద కూర్చోబెట్టుకొంది కిమోనీ.

పార్కీ యువకుడు ముగ్గురివద్దా సెలవు తీసుకొని కిమోనీని వెంటబెట్టుకొని వెళ్ళిపోయాడు. ముగ్గురూ స్టేషన్‌లోకి వెళ్ళి రైలెక్కిన రెండు నిముషాలకు ఆ రైలు అలహాబాదును వదిలింది.

అలహాబాగునుంచి కలకత్తాకు ఒక రాత్రీ ఒక పగలు ప్రయాణం. అంటే వారు కలకత్తా చేరేసరికి మరునాడు ఉదయం అవుతుందన్నమాట. కాని కలకత్తా రేవునుంచి హాంకాంగ్ వెళ్లే ఓడ మధ్యాహ్నం పన్నెండుగంటలకు గాని బయలుదేరదు.

ఏదేమైనా మిస్టర్ చిదానందం తన ప్రయాణంలో మొదటి భాగాన్ని ఖచ్చితమైన సమయానికి పూర్తి చేసాడు.

6

పదకొండు గంటలైంది.

కలకత్తా రేవులో ఒక పెద్దమనిషి విసుగ్గా పచార్లు చేస్తున్నాడు.

ఐదున్నర అడుగులపైన ఎత్తుండి నల్లటి బట్టలు వేసుకొన్న ఆ తెల్లటి మనిషి నామధేయం మిస్టర్ ఫాక్స్. డిటెక్టివ్. అతని చూపులు రేవులోకి వచ్చి పోతున్న ప్రతీ వ్యక్తిపైనా అనుమానంగా నిలుస్తున్నాయి.

బిగించినట్లుండే ఆ పెదవుల్లో పట్టుదలా నల్లటి కళ్ళజోడు వెనక చాకులా కదిలే అతని కళ్ళల్లోని కార్యదీక్ష సాధారణంగా ఎదుటి వ్యక్తి గ్రహించలేడు.

టైము చూసుకొన్నాడు మిస్టర్ ఫాక్స్. గంట పన్నెండౌతోంది. రేవులో సింగపూర్ మీదుగా హాంకాంగ్ వెళ్ళే స్టీమరు 'మంగోలియా' కూత కూస్తోంది. స్టీమరుపై జండా సముద్రపు గాలికి విపరీతంగా కదులోంది.

జేబులో చెయ్యెట్టి పర్సు తీసాడు మిస్టర్ ఫాక్స్. పర్సు లోపలున్న పసుపు పచ్చని కాగితం అతనిలో నీరు కారిపోతోన్న ఉత్సాహానికి టానిక్‌లా పనిచేసింది. నెమ్మదిగా మడతలు విప్పాడు.

అది కలకత్తా పోలీస్ కమీషనర్ జారీచేసిన అరెస్ట్ వారంట్. మిస్టర్ ఫాక్స్‌కు అనుమానం కలిగిన ఏ వ్యక్తినైనా తక్షణం అరెస్ట్ చేయటానికి అధికారం కల్గిస్తోన్న పత్రం అది.

అక్టోబరు 6 వ తేదీ రాత్రి 9, 10 గంటల మధ్య బొంబాయి బ్యాంక్ ఆఫ్ ఇండియాలో జరిగిన బ్రహ్మాండమైన చోరీ గురించి ఆచూకీ తియ్యడానికి ప్రభుత్వం నియమించిన గూఢచారుల్లో ఒకడు మిస్టర్ ఫాక్స్.

మూడురోజులుగా అదే రేవులో కాపలా కాస్తున్న మిస్టర్ ఫాక్స్‌కు నెమ్మదిగా అపనమ్మకం ఏర్పడుతోన్నా బాంక్ ఆఫ్ ఇండియావాళ్ళు ఇస్తామన్న 5% కమీషన్ ఆశ మింగేస్తోంది.

"హల్లో మిస్టర్ ఫాక్స్!" అన్న పలకరింపుతోబాటు భుజంపై చెయ్యిపడగానే వెనుతిరిగి చూసాడు గూఢచారి ఫాక్స్. అతని ముఖం వికసించింది.

"వాట్ మిస్టర్ ఫాక్స్! మీ పరిశోధన ఎంతవరకూ వచ్చింది?" అడిగాడు ఆ వ్యక్తి.

"త్వరలోనే పూర్తవుతుందని నా దృఢవిశ్వాసం మిస్టర్ కాన్సల్!" గంభీరంగా నవ్వాడు ఫాక్స్.

"మిస్టర్ ఫాక్స్! ఒక విషయంమాత్రం నాకు బోధపడటంలేదు. మీకు కావలసిన వ్యక్తి రేవులోకి వచ్చినా మీకు అందిన వర్ణనలనుబట్టి అతన్ని ఎలాగ గుర్తించగలుగుతారు?"

"చూడటం, గుర్తుపట్టటం కాదు సార్ జరగవలసింది. చూసీ చూడగానే పసి గట్టేస్తాం. ఇదో విద్య. దానికి తగినంత నేర్పూ, సిక్త్ సెన్స్ ఉండాలి."

"అన్నట్లు దొంగిలించబడిన మొత్తం ఏమాత్రం ఉందన్నారు?"

"ఏ మాత్రమా? ఐదులక్షలు విలువచేసే ఇంగ్లాండ్ కరెన్సీ!"

"అబ్బా! చాలా బ్రహ్మాండమైన చోరీ! ఈ మధ్య కాలంలో ఇలాంటిదేదీ జరుగలేదుకూడా!"

"యస్ మిస్టర్ కాన్సెల్. ఈరోజుల్లో దొంగ వెధవలు చిన్న మొత్తాలకే కక్కుర్తిపడిపోతున్నారు" అన్నాడు డిటెక్టివ్ ఫాక్స్ కలియచూస్తూ.

"ఓ. కె. మిస్టర్ ఫాక్స్! నాకొంకొంచెం పను లున్నాయి. ఇక నేను వెళతాను." కరచాలనం చేసి కాన్సెల్ తన కార్యాలయానికి వెళ్ళిపోయాడు.

ఫాక్స్‌కి క్షణక్షణానికీ చిరాకు, విసుగు యెక్కువై పోతున్నాయి. ఒళ్ళంతా కళ్ళుచేసుకొని ప్రయాణీకులని పరిశీలిస్తున్నాడు.

అంతలో ఒకవ్యక్తి కూలీలను తోసుకొంటూ దారిచేసుకొని తిన్నగా మిస్టర్ ఫాక్స్‌దగ్గరకొచ్చాడు.

"దయచేసి రేవు అధికారి కార్యాలయం ఎక్కడో చెప్తారా?" అంటూ అడిగాడు. అతని ముఖం చూడగానే ఫాక్స్ ఉలిక్కిపడ్డాడు.

ఆరడుగుల ఎత్తుండి చాలా గంభీరంగా ఉన్నాడా వ్యక్తి. నోట్లో సిగార్. బాగా ధనవంతుడిలా ఉన్నాడు. వెనుక సంచి పట్టుకొని నిలబడ్డ నౌకరు.

మిస్టర్ ఫాక్స్ హృదయం యాంగ్జయిటీతో ఉరకలేసింది. రెండు గుప్పిళ్ళూ బిగుసుకొన్నాయి.

మాట్లాడకుండా కొంచెం దూరంలోవున్న రేవు అధికారి కార్యాలయంవైపు చూపించాడు.

థాంక్స్ చెబుతూ ఆ వ్యక్తి నౌకరుతో అటువైపు నడిచాడు.

'ఎక్కడికి పోతావురా బడాచోర్! ఐదులక్షల రూపా

యలతో ఈ ఫాక్స్ కళ్ళు కప్పి పోవాలనుకోవటం నీ తెలివితక్కువ!' ఉత్సాహంగా అనుకొంటూ పర్సుకోసం జేబులో చెయ్యిపెట్టిన మిస్టర్ ఫాక్స్‌ను ఖాళీజేబులు వెక్కిరించాయి. పర్సు ఎవరో కొట్టేశారు.

కళ్ళు తిరిగాయి డిటెక్టివ్ ఫాక్స్‌కు.

7

'మంగోలియా' స్టీమరు కలకత్తా రేవును వదిలేసరికి చిదానందం, భాషీరలు ఒక కాబిన్‌లో విశ్రాంతిగా కూర్చొన్నారు.

ఆ ప్రక్క కాబిన్‌లోనే డిటెక్టివ్ ఫాక్స్ గోతికాడ నక్కలా కూర్చొన్నాడని వారికా క్షణంలో తెలియదు.

బొంబాయినుంచి కలసి ప్రయాణంచేసిన బ్రిగేడియర్ విక్రమ్ బెనారస్‌లో దిగిపోయాక వాళ్ళిద్దరినీ అనుకున్న సమయానికంటే అరగంట ముందుగానే కలకత్తా స్టేషనులో దింపింది రైలు. స్టేషన్‌నుంచి బైటకివచ్చి టాక్సీలో రేవుకు చేరారు.

రేవులో కన్పించిన ఫాక్స్‌ను అడిగి తెలుసుకొని రేవు అధికారి కార్యాలయానికి వెళ్ళాడు చిదానందం. తా మిా హార్బర్‌లో వోడెక్కుతున్నామని పాస్‌పోర్ట్‌పై ముద్ర వేయించుకొని, అందుకయిన మూల్యాన్ని చెల్లించి, వెంటనే 'మంగోలియా' నౌకమీదకి వచ్చిపడ్డారు.

చిదానందం తన నోట్‌బుక్ తెరిచి అప్పటివరకూ జరిగిన ప్రయాణంలోని సంఘటనలను వివరంగా వ్రాసాడు.

మంగోలియా ఉత్సాహంగా వెళ్తోంది హాంకాంగ్‌నుంచి యోకాహామా వెళ్ళే నౌక కర్ణాటిక్‌ను అందుకోటానికి.

అదే సమయంలో ప్రక్కగదిలో వున్న డిటెక్టివ్ ఫాక్స్ తన భవిష్యత్ గురించి ఆలోచిస్తున్నాడు.

తన ఖర్మ కాకపోతే సరిగ్గా అదే సమయానికే తన పర్సు ఎవడో కొట్టెయ్యాలా? చేజేతులా అవకాశాన్ని వదులుకొనే రకం కాదు డిటెక్టివ్ ఫాక్స్.

పోలీస్ కమీషనర్ కార్యాలయానికి ఫోన్ చేసి మరో వారంట్ తెప్పిద్దామంటే సమయం లేదు. రెండు నిము షాల్లో నౌక బయలుదేరబోతోంది. వెంటనే రేవు అధికారి కార్యాలయంలో ప్రవేశించి అర్జంటుగా ఒక పాస్‌పోర్టు సంపాదించాడు.

కమీషనర్ కార్యాలయానికి ఫోన్ చేసి కమీషనర్ పి. ఏ. లైన్‌లోకి రాగానే సంగతంతా చెప్పి తనపేరున సింగపూర్‌కు ఒక అరెస్ట్ వారంట్ పంపమని కోరి, పరిగెత్తుకెళ్ళి కదలబోతోన్న మంగోలియాపై కెక్కేసాడు.

కోటు క్రిందవున్న మరో షర్ట్ పాకెట్‌లోని బరువైన వాలెట్ అతనికా క్షణంలో ఎంతో ఉపయోగించింది. సింగపూర్‌లో ఇండియన్ గవర్నమెంటుకున్న పలుకుబడితో మిస్టర్ చిదానందంని అరెస్టు చెయ్యటం అంత కష్టంగా కన్పించలేదు డిటెక్టివ్ ఫాక్స్‌కి.

ప్రయాణంలో ప్రథమ భాగం సాఫీగా, చక్కగా సాగిపోయింది. బంగాళాఖాతం దిగువ భాగమంతా ఎటువంటి వడిదుడుకులు లేకుండా దాటిపోయింది. కొద్దిరోజుల్లోనే అండమాన్ దీవులు తగిలాయి. 2400 అ॥ ఎత్తున మనోహరంగా నిలిచిన శాడిల్ పీక్ పర్వతం కనులకింపుగా కన్పిస్తోంది.

ఓడ ఎక్కడా ఆగకుండా అండమాన్ ద్వీప సమూహాన్ని దాటి మలక్కా దీవులవైపు సాగింది. అక్కడి నుంచి చైనా సముద్రంలో ప్రవేశిస్తుంది.

మిస్టర్ ఫాక్స్ ఆశలన్నీ సింగపూర్ మీదే వున్నాయి. సమయానికి అరెస్ట్ వారంట్ అందితే కలకత్తాలో పట్టుకో లేకపోయినా సింగపూర్‌లోనన్నా పట్టుకోవచ్చు. కాని మిస్టర్ ఫాక్స్‌ని ఒక సందేహంమటుకు బాధిస్తోంది.

ఓడ సింగపూర్‌లో ఆగే సమయం చాలా తక్కువ. అంటే ఏ ఆరేడు గంటలో ఆగుతుంది. అదీ బొగ్గు వేసుకో డానికి. ఆ కాస్త సమయంలోనూ గాని వారంట్ అందక పోతే ఇక తాను దొంగను పట్టుకోవటం అసంభవం.

హాంకాంగ్‌లో చైనా అజమాయిషీ ఎక్కువ. అక్కడ పట్టుకోవచ్చుగాని, అధికారులద్వారా చాలా వత్తిడి తీసుకురావాలి. ఇదంతా చాలా శ్రమా, కాలాలతో కూడిన పని. తీరా అంతా చేసేలోగా ఆ దొంగ వెధవ హాంకాంగ్ దాటేశాడంటే ఇంక తను వెనుతిరగటమో, లేక వాడివెంటే తోకలాగ వారంట్ పట్టుకొని తిరుగుతూ ఇండియా చుట్టుప్రక్కలకి రాగానే అరెస్ట్ చేయటమో చెయ్యాలి.

కాని చిదానందం హాంకాంగ్ దాటాడంటే ఏ కాలిఫోర్నియాలోనో లేదా బ్రిటిష్ ఐల్స్‌లోనో మకాం పెట్టేస్తాడు. అప్పుడు వాడిని పట్టుకోవటం అసాధ్యం కాకపోయినా, దుస్సాధ్యం అవుతుంది.

అక్టోబరు 14 వ తేదీ మంగళవారం మధ్యాహ్నం మలక్కా సంధిలో ప్రవేశించింది మంగోలియా. కొండలూ గుట్టలూ సుమిత్రాదేవి సౌందర్యం కన్పించకుండా అడ్డుపడుతున్నాయి.

మర్నాడు ఉదయం నాలుగున్నరకు సింగపూర్ రేవులో బొగ్గు వేసుకోడానికి ఓడ లంగరు వేసింది. నౌక రేవులో

ఆగిన మరుక్షణం క్రిందకి దూకాడు డిటెక్టివ్ ఫాక్స్. చిదానందం, భాఘీరలుకూడా క్రిందకి దిగి నగరంలోకి బయలుదేరారు. వారికి కన్పించకుండా అనుసరించటం ప్రారంభించాడు డిటెక్టివ్ ఫాక్స్.

ఆ ఉషోదయంవేళ సింగపూర్ నగరం అత్యద్భుతంగా వుంది. నౌకల రంగురంగుల కాంతిలో హార్బర్ కన్నుల పండుగగా వుంది.

ప్రపంచదేశాలలో వున్న అందమైన పట్టణాలలో ఒకటిగా పేరుపొందిన సింగపూర్ నగరాన్ని చూస్తోంటే చిదానందం హృదయంలో ఆనందం కదలాడుతోంది. నాలుగు గంటల తర్వాత నగరమంతా కలియతిరిగి తమ కావలసిన వస్తువులతో మంగోలియా చేరుకొన్నాడు చిదానందం, భాఘీరతో.

వారిద్దరూ తిరిగి మంగోలియాలోకి వెళ్ళగానే చాటుగా అనుసరిస్తోన్న డిటెక్టివ్ ఫాక్స్ తేలికగా నిట్టూర్చి హార్బర్ బైటకి నడిచాడు. ఓ పదినిముషాల తర్వాత అతనెక్కిన టాక్సీ సింగపూర్ పోలీస్ డిపార్ట్మెంట్ భవనాలముందాగింది. ఫేర్ చెల్లించి ఉరుకులు, పరుగులమీద లోనికెళ్ళాడు.

పోలీస్ కమీషనర్ లేచి నిలబడి షేక్హాండిచ్చాడు. కుర్చీలో కూర్చొని తనెందుకక్కడికి వచ్చాడో వివరంగా తెల్పి, తనపేరు నేదైనా అరెస్ట్ వారంట్ గాని వచ్చిందేమో చెప్పమన్నాడు.

కమీషనర్ అడ్డంగా తల త్రిప్పాడు, "సారీ మిస్టర్ ఫాక్స్! మీ పేరున ఏ అరెస్ట్ వారంట్ మా కందలేదు. వచ్చి ఉన్నట్లయితే మీ రిక్కడికి రానవసరం లేకుండా

మేమే కబురు చేసేవాళ్ళం" మిస్టర్ ఫాక్స్ ఆశలపై చన్నీళ్ళు గుమ్మరిస్తున్నట్లు నెమ్మదిగా చెప్పాడు.

ఐదు నిముషాలపాటు సబ్దుడైపోయాడు డిటెక్టివ్. చివరికో నిశ్చయానికొచ్చినట్లు తల విదిలించి లేవబోతూ అన్నాడు.

"పోనీ మిస్టర్ కమీషనర్! అరెస్ట్ వారంట్ కొంచెం అటూ ఇటూ ఎలాగూ వస్తుంది కాబట్టి, మీ పలుకుబడి ఉపయోగించి ముందుగానే..."

"సారీ మిస్టర్ ఫాక్స్! అరెస్ట్ వారంట్ లేకుండా విదేశీయులపై చర్యలు తీసుకొనే అధికారం మాకు లేదు. ఈ విషయంలో ఏ సహాయం చేయలేక పోతున్నందుకు క్షమించండి."

"ఇట్స్ ఆల్ రైట్! పోతే చిన్న సహాయంమాత్రం చేయండి. అరెస్ట్ వారంట్ అందేసరికిగాని మంగోలియా ఓడ సింగపూర్‌ను వదిలేస్తే నా పేరున హాంకాంగ్ పంపండి" అంటూ లేచాడు.

"ష్యూర్...ష్యూర్...విష్ యూ బెస్ట్ ఆఫ్ లక్" కరచాలనం చేస్తూ అన్నాడు కమీషనర్.

వేగంగా బైటికి వచ్చి మరెక్కడికీ పోవటానికి మన స్కరించక తిన్నగా హార్బర్‌కు వెళ్ళిపోయాడు డిటెక్టివ్ ఫాక్స్.

అతను చేరుకొన్న మరో రెండు నిముషాలకు మంగోలియా బొగ్గు నింపుకోవటం పూర్తిచేసి సింగపూర్ హార్బరును వదిలింది. క్రమంగా మలక్కా కొండలు కూడా దాటిపోయాయి. ఆరు రోజుల్లోగా అక్కడికి చేరుకొంటే యాకోహామా పోయే నౌకను సకాలంలో అందుకోవచ్చు.

ప్రయాణం రెండు రోజులు సాఫీగా సాగాక వాతావరణం మారింది. గాలి తెరలు తెరలుగా తుఫాను గాలివలె వీచడం ప్రారంభించింది. ఎందుకైనా మంచిదని తీరం వెంటే ఓడను వేగంగా నడిపించసాగాడు కేప్టెన్. అనుకోకుండా ఎదురౌతోన్న తుఫానువలన కలుగుతోన్న ఆలశ్యానికి భాషీరకు తల తిరిగిపోతోన్నా, అతని యజమాని చీమకుట్టినంతైనా బాధపడలేదు.

ఓడ కేప్టెన్‌ను, ఇంజనీరునీ, కళాసీలనీ ఒకరేమిటి? ఆ ఓడకు సంబంధించిన వాళ్ళందరినీ తిట్టిపోశాడు భాషీర. రోజులు గడుస్తున్నకొద్దీ పరిసితి మరింత ప్రమాదకరమై యాత్ర చివరి రెండు రోజులలోనూ వాతావరణం పూర్తిగా ప్రతికూలించింది.

అక్టోబరు 13వ తేదీని గాలివాన ముంచుకొచ్చేసింది. ఒక పూటంతా చాలా నెమ్మదిగా సాగింది ప్రయాణం. గాలివాన ఇలాగే నిలిచి ప్రయాణం ఈ తీరులోనే సాగేటట్లయితే ఓడ హాంకాంగ్ చేరుకోడానికి 24 గంటలకుపైగా ఆలశ్యం కావచ్చునని అంచనా కట్టాడు కేప్టెన్.

మహోగ్రంగా ప్రళయతాండవం చేస్తున్నట్లున్న కడలివైపు రెప్ప వాల్చకుండా చూస్తూ నిలబడిపోయాడు చిదానందం. ప్రకృతి అంతా అతనికి ఎదురుతిరిగి సవాలు చేస్తున్నట్లనిపించింది.

ఈ పరిస్థితి ఇలాగే సాగి ప్రయాణం ఆలశ్యమైతే యాకోహామా వెళ్ళే నౌక 'కర్నాటిక్' తప్పిపోతుంది. దాంతోపాటే 20 లక్షల రూపాయల పందెం కూడా గాలిలో కెగిరిపోతుంది.

ఆ నౌకమీద అంత తుఫాన్ని చూసి కూడా అనం

దంతో పొంగిపోతున్న మహానుభావుడు డిటెక్టివ్ ఫాక్స్ ఒక్కడే. ఈ తుఫాను పుణ్యమా అని ప్రయాణం కాస్తా ఆలశ్యమై అవతలి ఓడ తప్పిపోయి చిదానందం హాంకాంగ్‌లో ఆగిపోతే? అంతకన్నా కావలసిందేమున్నది?

భాషీరతో పరిచయం చేసుకొని రాబట్టిన వివరాలన్నీ మననం చేసుకొంటూ తియ్యగా ఊహించుకోసాగాడు డిటెక్టివ్ ఫాక్స్.

ఈ అవరోధం ఏర్పడటం వలన భాషీరకు వచ్చిన కోపం అంతా ఇంతా కాదు. హోరుగా వీస్తోన్న గాలినీ, విసురుగా లేస్తోన్న కెరటాలనూ చూస్తోంటే అతని ఒళ్ళు మండిపోతోంది. వీల్లేదుగాని కుదిరితే కొరడా పెట్టి చావ బాదేను వాటిని.

అక్టోబరు 19వ తేదీన వాన వెలిసింది.

గాలి శాంతించింది.

మంగోలియా వాలుగాలిలో హాంకాంగ్ వైపు మహా వేగంగా ప్రయాణం సాగించింది.

ఏం చేసినా ఏం చెయ్యకపోయినా కాలం తిరిగిరాదు. అయిన ఆలశ్యం చెరిగిపోదు. దానికి తల ఒగ్గవలసిందే.

ఫలితంగా 20 గంటల ఆలశ్యంగా అక్టోబరు 23వ తేదీన ఉదయం ఐదున్నరకు హాంకాంగ్ రేవులో ప్రవేశించింది మంగోలియా.

అప్పటికే యొకోహామా వెళ్ళే ఓడ 'కర్ణాటిక్' 16 గంటలు ముందుగా ఆ తీరాన్ని వదిలిందని మరో పావు గంట తర్వాత గాని తెలియలేదు చిదానందం బృందానికి.

భాషీర కృంగిపోయాడు.

ఫాక్స్ పొంగిపోయాడు.

8

మిస్టర్ చిదానందం ముఖంలో చిరునవ్వు లీలగా కదిలి మాయమైంది.

"ఎందుకలా బాధపడతావ్? ఒక చిన్న సంఘటన జరిగింది. అంతకన్నా మరేంలేదు" అన్నాడు భాఘీరవైపు చిరాగ్గా చూస్తూ.

చిదానందం తత్వం తెలిసిన భాఘీర ఆ మాటలకు ఆశ్చర్యపోలేదు.

"మరేం చెయ్యాలి? కర్ణాటిక్ నిలువునా దగా చేసింది. మరో వారం దాకా యోకోహామా వెళ్ళే నాకేదీ లేదు" నిస్పృహగా నిట్టూర్పుతూ అన్నాడు భాఘీర.

"కర్ణాటిక్ పోయినా హాంకాంగ్ రేవులో ఇంకా ఏవో స్టీమర్లున్నట్లున్నాయి" అన్నాడు చిదానందం ముందుకి కదుల్తూ.

చిదానందం యధాలాపంగా అన్న ఈ మాటలు గాని వినివుంటే డిటెక్టివ్ ఫాక్స్ గుండె గుభిల్లుమనేది. కాని ఆ మాట వినటానికి అతనక్కడలేడు. వారంటు తెచ్చుకో డానికి హార్బరులోకి దిగగానే నగరంలోకి పరిగెత్తాడు.

చిదానందం ఇలా మాట్లాడుతుండగా ఒక నావికుడు వచ్చి పలకరించాడు.

"దొరగారు బోటుకోసం చూస్తున్నట్లున్నారు?"

"అవును. వెంటనే బయలుదేరే బోటేదైనా ఉందా?"

"లేకేమండి. టాంక్ డియర్ బోటు ఇక్కడి పడవ లన్నింటిలోనూ గొప్పది."

"వేగంగా పోతుందా?"

"ఆహా! గంటకి పదకొండూ, పన్నెండూ నాట్ల మధ్య ఉంటుంది. చూస్తారా?"

"పద!"

"తమరి షికారుకు బాగానే సరిపోతుంది లెండి!"

"షికారుకా? కాదు! యాత్రకు." సిగార్ వెలిగించు కొంటూ అన్నాడు చిదానందం.

"యాత్రకా?"

"అవును. మమ్మల్ని యాకోహామా తీసుకెళ్తావా?"

టాంక్ డియర్ నావికుడు తెల్లబోయాడు.

"దొరగారు పరాచికాలాడుతున్నట్లున్నారు."

"లేదు. కర్ణాటిక్ తప్పిపోయింది. 26న యాకోహామా నుంచి బయలుదేరే శాన్ ఫ్రాన్సిస్కో నౌకకు మేం అందు కోవాలి."

"క్షమించాలి. యాకోహామావరకూ మిమ్మల్ని చేర్చ లేను" తల వంచుకున్నాడు నావికుడు.

"రోజుకు రెండువేల పౌండ్లు ఇస్తాను కిరాయి. సమ యానికి యాకోహామా చేరిస్తే మరో ఐదువేల పౌండ్లు అదనంగా ఇస్తాను. ఆలోచించుకో" గంభీరంగా పల్కాడు చిదానందం.

"చిత్తం! తమరంతగా అడుగుతోంటే ఎలా కాదన గలను. మరో అరగంటలో బయలుదేరుదాం" అంటూ వాళ్ళిద్దర్నీ టాంక్ డియర్‌లోకి తీసుకుపోయాడు నావికుడు.

మరో అరగంటలో కావలసినంత ఇంధనం నింపుకొని ఇద్దరు ఇంజనీర్లు, అరడజనుమంది కళాసులతో టాంక్ డియర్ యాకోహామాకు బయలుదేరింది.

చిన్నదైనా అన్ని వసతులూ కలిగి అనువుగా వున్న బోటు టాంక్ డియర్.

ముచ్చటగా మూడు కాబిన్‌లు, ఒక ఇంజన్ రూమ్'

బోటు కిరువైపులా విశాలంగా వున్న రెండు డెక్‌లు. ఇదీ టాంక్ డియర్ ఆకారం. కాబిన్లు క్రింద వున్న మరో పొడుగైన గది సామాన్లు నిల్వచెయ్యటానికీ, కళాసులు నివసించటానికి పనికివస్తోంది.

రాత్రి పది గంటలవేళ గాలి జోరు హెచ్చింది. తలెత్తి చూసిన కేప్టెన్ 'బన్సబీ'కి ఆకాశం నిర్మలంగా కన్పించటంతో రక్షణ ప్రయత్నాలేమీ చెయ్యలేదు. పది గంటలకు చిదానందం, అతని అనుచరుడు భాషీరా శుభ్రంగా భోజనాలు కానిచ్చి కాబిన్‌లోకి వెళ్ళిపోయారు.

నాకమీద సిబ్బందీ, నావికుడు 'బన్సబీ' ఆ రాత్రంతా డెక్‌మీదే ఉండిపోయారు.

మర్నాడు సూర్యోదయానికి టాంక్ డియర్ రెండు వందల మైళ్ళ పైగా ప్రయాణం చేసింది. కేప్టెన్ దూరం, కాలం చూసి వేసిన లెక్కలవలన గంటకు సగటున 9 నాట్ల వేగంతో పోతున్నట్టు తేలింది.

ఆ రోజంతా టాంక్ డియర్ తీరం వెంట వేగంగా ప్రయాణం చేసింది. వాలుగా వీస్తోన్న గాలి ఎక్కువై టాంక్ డియర్ వేగాన్ని మరింత పెంచుతోంది.

సముద్ర ప్రయాణాలలో ఏర్పడే వికారాలేమీ చిదానందం, భాషీరలకు వచ్చి పడలేదు. ఇద్దరూ సుష్టుగా కడుపారా ఆరగించారు. బోటు జోరుగా పోతోంది. కేప్టెన్ బన్సబీ చాలా హుషారుగా ఉన్నాడు. వేళ తప్పకుండా గమ్యం చేరుకొంటే వచ్చే బహుమతి బన్సబీకీ, అతని అనుచరులకూ వళ్ళు పులకరింపజేస్తోంది.

ఆ సాయంత్రానికి మూడువందల పదిహేను మైళ్ళ ప్రయాణం జరిగినట్లు 'బన్సబీ' తన 'లాగ్' (ఓడల దిన

చర్య) పుస్తకంలో రాసుకొన్నాడు. టాంక్ డియర్ ఆ రాత్రి చైనా తీరానికి, ఫార్మోజా దీవికి మధ్యన ఉన్న ఫొకియాన్ జలసంధిలో ప్రవేశించి ప్రయాణం సాగించింది.

సముద్రం ఆ ప్రాంతంలో మహాకల్లోలంగా ఉంది' వాతావరణం క్రమంగా మారుతోంది. బోటు ముందుకి నడవటం కష్టంగా ఉంది. ఎదురుగా వచ్చే కెరటాలు ఉధృతంగా తాకుతున్నాయి.

గాలి తెల్లవారుఝాముకల్లా మరింత పెరిగిపోసాగింది. బరోమీటరులో పాదరసం తుఫాను సూచనగా ఎగిరెగిరి పడుతోంది. పెనుతుఫాను విరుచుకుపడే వాతావరణం ఏర్పడింది.

కేప్టెన్ కాబిన్ లోకి వచ్చి చిదానందంని కలిశాడు. "మీకో విషయం తెల్పాలి" అన్నాడు గంభీరంగా.

"తెల్పండి!"

"కొద్దిసేపట్లో తుఫానుగాలి వీయబోతోంది."

"ఎటునుంచి?"

"దక్షిణంనుంచి... తుఫాను రాబోతుంది."

"అయితే ఇకనేం? దక్షిణంనుంచి వీస్తే మన పడవని గమ్యంవైపు తోయబోతోందన్నమాట."

"మీరలా అంటే నేను చెప్పేదేమీ లేదు" అంటూ బైటకు వెళ్ళిపోయాడు 'బన్స్బీ'.

మరో గంటలో భయంకరంగా తుఫాను దూసుకొచ్చింది. బన్స్బీ ముందుజాగ్రత్తగా కట్టుదిట్టాలన్నీ చేసేశాడు. బోటులోకి ఒక్క బొట్టు కూడా నీరు రాకుండా జాగ్రత్తపడ్డాడు. ప్రళయభీకరంగా వీస్తోన్న గాలి టాంక్ డియర్ను ఉత్తరంవైపుగా ఎగరేసుకు

పోతోంది. గాలికంటే వేగంగా పోతోన్న టాంక్ డియర్ ఆ పగలంతా అలాగే ప్రయాణించింది.

బ్రహ్మాండమైన కెరటాలపైనుంచి తేలుతూ పట్టపగ్గాలు లేకుండా పరిగెత్తుతోన్న టాంక్ డియర్ వెనకనుంచి పర్వతాలలా లేచి విరిగిపడుతోన్న కెరటాల మధ్యనుంచి ఓ ఇరవైసార్లన్నా తప్పించుకొని ఉంటుందా రోజు.

కేప్టెన్ 'బన్స్‌బీ' అపారమైన చాకచక్యం, ఒడుపూ దాన్ని కాపాడుతూ వచ్చాయి.

సాయంత్రమయ్యేసరికి ఉత్తరాభిముఖంగా పోతోన్న టాంక్ డియర్ గాలివాలు మారటంతో ప్రక్కకు తిరిగింది. చీకటిపడేసరికి తుఫాను మరింత ఉధృతమైంది. 'బన్స్‌బీ' వాతావరణం చూసి కంగారుపడ్డాడు. మిగతావాళ్ళతో కూడా సంప్రదించి చిదానందం దగ్గర కొచ్చాడు.

“మనం తీరానికి వెళ్ళి ఏదో ఒక రేవులో లంగరు వేయటం మంచిదనుకొంటున్నాను” అన్నాడు.

“అవును. నేనూ అదే అనుకొంటున్నాను” అన్నాడు మిస్టర్ చిదానందం.

“భేష్! ఏ రేవు?”

“నాకు తెల్సిందల్లా ఒక్కటే రేవు.”

“చెప్పండి.”

“యాకోహామా!”

నిర్ఘాంతపోయాడు బన్స్‌బీ. మాట్లాడకుండా బైటకెళ్ళిపోయాడు. టాంక్ డియర్ మాత్రం యధాప్రకారం ఉత్తరాభిముఖంగా ప్రయాణం సాగించింది.

ఆ రాత్రి వాళ్ళపాలిటి కాళరాత్రిగా మారింది. తుఫాను విలయతాండవం చేసింది. ఆ ప్రళయంలో

ఆ చిన్న నావ మునిగిపోకపోవటం ఒక అద్భుతం.

తెల్లవారింది. చీకటి వీడినా తుఫాను తగ్గకుండానే విజృంభిస్తోంది. మధ్యాహ్నానికి మాత్రం తెరిపి ఇచ్చే సూచనలు కన్పించాయి. సాయంత్రం పొద్దుపోయేసరికి ఆ సూచనలు మరింత బలపడ్డాయి. అందరూ కుదుట పడ్డారు.

చిదానందం, భాషీర, బన్స్‌బీలు తేలిక భోజనంచేసి విశ్రమించారు.

రాత్రి కొంతవరకూ ప్రశాంతంగానే ఉంది. మర్నాడు ఇరవైఆరవ తారీఖు ఉదయానికి పూర్తిగా తగ్గిపోయింది గాలివాన. సముద్రం ఎప్పటి గంభీరతను అలవర్చుకొంది. కేప్టెన్ బన్స్‌బీ లెక్కలువేసి యాకోహామా ఇంకా రెండువందల మైళ్ళుందని తేల్చాడు.

ఆపైన ప్రయాణం సాఫీగా సాగింది. ఎంత వేగంగా పోయినా 28వ తేదీ సూర్యోదయానికి యోకొహామాకు 12 మైళ్ళ దూరంలో ఉండిపోయారు.

ఏడు గంటలకు బయలుదేరే శాన్‌ఫ్రాన్సిస్కో షిప్‌ను చేరలేనేమోననే భయం ఎక్కువైపోయింది 'బన్స్‌బీ'కి. ఆరుగంటల యాభై నిముషాలకు టాంక్ డియర్ యాకోహామాకు 3 మైళ్ళ దూరాన ఉండిపోయింది. దూరంగా, అస్పష్టంగా కన్పిస్తున్నాయి భవనాలు పొగమంచులో. కేప్టెన్‌కు ప్రాణం నీరసంతో మూలిగింది. చూస్తూచూస్తూ ఐదువేల పౌండ్లు చెయ్యిజారిపోయేలా ఉంది. చిదానందం వైపు దీనంగా చూశాడు.

చిదానందం ముఖం బిగుసుకొని వుంది. పూర్తిగా ఆలోచనలో మునిగిపోయినట్లు కన్పిస్తున్నాడు.

ఆ సమయంలో దూరంగా దిగంతాన ఒక నల్లటి పొగ గొట్టం కన్పించింది. దానిమీద తెల్లటి పొగ. అది యాకోహామానుంచి శాన్ ఫ్రాన్సిస్కో పోయే ఓడకు చెందినది.

పైలట్ బన్నబీ అదిరిపడ్డాడు.

"సంకేతాలు పంపి ఆపండి!" అన్నాడు చిదానందం.

డెక్ మీద వున్న ఫిరంగి దగ్గరకు పరిగెత్తారంతా. ప్రమాదస్థితికి సూచనగా జెండాను పతాక స్థంభంమీద సగం ఎత్తున ఎగురవేశాడు కేప్టెన్.

మరో రెండు నిముషాల్లో ఫిరంగి ప్రేలి ధ్వనితరంగాలు సముద్రంమీద బయలుదేరాయి.

9

డిటెక్టివ్ ఫాక్స్ హాంకాంగ్ లో పోలీస్ వున్నతాధికారిని కలుసుకోనేసరికల్లా సింగపూర్ నుంచి రీ-డైరెక్ట అతనికోసం అరెస్ట్ వారంట్ వచ్చేసి వుంది. దాన్ని తీసుకొని జేబులో పెట్టుకోగానే డిటెక్టివ్ ఫాక్స్ పొందిన ఆనందానికి అంతులేకపోయింది.

ఆ అధికారికి కృతజ్ఞతలు తెల్పుకొని వున్నఫళంగా హార్బరుకు బైలుదేరి వచ్చేసాడు. అక్కడెక్కడా చిదానందం కనబడక పోయేసరికి వాకబు చేసిన ఫాక్స్ కు అంతక్రితమే చిదానందం తన అనుచరుడితో కల్సి టాంక్ డియర్ నాకలో యాకోహామా వెళ్ళిపోయినట్లు తెలిసింది. ఆ విషయం వినగానే మిస్టర్ ఫాక్స్ స్థంభించిపోయాడు. మరునిముషం అతనికి వెర్రి కోపం వచ్చేసింది. ఆ విషయం తెల్పిన వ్యక్తి పీక నులిమేయాలన్పించింది.

రెండు నిముషాలపాటు ఏంచెయ్యాలో తోచక ఆలోచిస్తూ నిలబడిపోయాడు. నెమ్మదిగా ఆలోచననుండి తేరుకొని అక్కడుండి ప్రయోజనంలేదు గనక హార్బర్ లోంచి

బైటికొచ్చి నగరంలోకి బైలుదేరాడు.

హోటల్లో ఒక రోజంతా విశ్రాంతి తీసుకొన్నాక డిటెక్టివ్ ఫాక్స్ మెదడు పనిచెయ్యటం ప్రారంభించింది. కలకత్తా పోలీస్ డిపార్టుమెంట్ వారికీ బొంబాయిలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా వాళ్ళకీ జరిగిందంతా తెలుపుతూ 'ఎక్స్‌ట్రాడిషన్' ఆర్డర్ పంపమని కోరి ఓ బాగ్ పట్టుకొని అరగంటలో విమానాశ్రయానికి వెళ్ళి జపాను వెళ్తోన్న విమానంలో 23వ తేదీ ఉదయం 4 గంటలకు యొకోహామా చేరుకొన్నాడు.

తర్వాతి రెండు రోజులూ కులాసాగా గడిపేసి అక్టోబరు 26వ తేదీ తెల్లవారుఝూము ఐదుగంటలకు సరంజామాతో యొకోహామా రేవులో కాపువేశాడు. రేవులో ఒడ్డున నిలబడ్డ శాన్ ఫ్రాన్సిస్కో నౌక 'జనరల్ గ్రాంట్' పెద్ద పర్వతంలా వుంది. అధునాతనమైన ఆ నౌక బరువు ఎనిమిది వేల టన్నులు. అది పసిఫిక్ మెయిల్ స్టీమ్‌షిప్ కంపెనీవారిది. దాని వేగం సుమారు పాతిక నాట్లు, అలా వెళ్తే పసిఫిక్‌ను దాటటానికి 21 రోజులు సరిపోతుంది.

ఆరున్నరైనా మిస్టర్ చిదానందంతో బయలుదేరిన టాంక్ డియర్ రాకపోవటం మిస్టర్ ఫాక్స్‌కు తొట్రుపాటును కలుగజేస్తోంది.

పావు తక్కువ ఏడు గంటలకు జండా ఎగురువేసి రెండు మూడుసార్లు కూసింది జనరల్ గ్రాంట్. హార్బరంతా కలకలం ఎక్కువైంది. మిస్టర్ చిదానందం మిస్ అయిన 'కర్నాటిక్' నౌక ఓమూల ఇంధనం నింపుకోవటం చూసాడు డిటెక్టివ్.

సరిగ్గా ఏడుగంటలకు మరోసారి కూతవేసి బయలు

చేరింది జనరల్ గ్రాంట్. డిటెక్టివ్ ఫాక్స్‌లో కలవరం ఎక్కువైపోతోంది.

ఒకవేళ టాంక్ డియర్ సరైన టైమ్‌కి అడంగు చేరుకో లేక పోయిందేమోననే అనుమానం కలగగానే ఎందుకైన మంచిదని ఆ రోజంతా అక్కడే నిఘా వేస్తూ వుండిపోదా మనే నిశ్చయాని కొచ్చాడు.

మరో అరగంట గడిచీ గడవకముందే టాంక్ డియర్ హార్బర్‌లోకి వస్తూ కన్పించింది. ఎగిరి గంతేసాడు ఫాక్స్.

"మిస్టర్ చిదానందం... ఈసారి నా చేతుల్లోంచి తప్పించుకోవటం నీ తరంకాదు కదా, నీ బాబు తరం కాదు..." అనుకొన్నాడు కసిగా.

పది నిముషాల తర్వాత టాంక్ డియర్ బోటు వేగంగా దూసుకొచ్చి హార్బర్‌లో ఆగింది. ఒక్క పరుగులో వెళ్ళి బోటు చేరుకొన్నాడు డిటెక్టివ్ ఫాక్స్. బోటులోంచి దిగిన కేప్టెన్ 'బన్సబీ' ముఖం ఆనందంతో కళకళలాడు తోంది.

10

జనరల్ గ్రాంట్‌లో ప్రయాణం సాఫీగా సాగింది. ఉప్పెనలూ, ఉత్పాతాలూ ఎదురవ్వలేదు. ఫసిఫిక్ సముద్రం శాంతి సముద్రం అన్న బిరుదు సార్థకం చేసుకొని మాట దక్కించుకొంటూ లెక్కప్రకారం నవంబరు 13వ తారీఖు ఉదయం గోల్డెన్ గేట్ అఖాతంలో ప్రవేశించి శాన్ ఫ్రాన్సిస్కో రేవు చేరుకొని లంగరు వేసింది.

నౌకదిగిన చిదానందంకి రేవునిండా అన్నిదేశాల నౌకలు ఆగి వుండటం కన్పించింది. 'శాక్రిమెంట్' మీదా దాని ఉపనదుల మీదా తిరిగే స్టీమ్ బోట్‌లు కోకొల్లలుగా

వున్నాయి. మెక్సికో, పెరూ, చైల్, బ్రాజల్, యూరప్, ఆసియాల మధ్య పసిఫిక్ సముద్రంలోని దీవుల మధ్యా జరిగే వ్యాపారమంతా ఈ రేవులోనే కన్పడుతోంది.

చిదానందం రేవులోంచి బైటకు వస్తోండగా ఆదరా బాదరా రేవులోనికి వస్తోన్న మిస్టర్ ఫాక్స్ కన్పించాడు.

ఫాక్స్‌ని చూడగానే భాషీర తెల్లబోయాడు. మిస్టర్ చిదానందం మాత్రం పలకరింపుగా చిరునవ్వు నవ్వాడు.

"మీరా? ఇక్కడా? అమెరికా గడ్డమీదా?" ఆశ్చర్య బోతూ అడిగాడు భాషీర.

"నువ్వా? ఇక్కడా?" తనూ ఆశ్చర్యం నటించాడు మిస్టర్ ఫాక్స్. అతనికి మహదానందంగా వుంది. యోకో హామాలో తప్పించుకుపోయినా ఇక్కడ మాత్రం సమయానికి పట్టుకోగలిగాడు. తన జేబులోని అరెస్ట్ వారంట్ ఇక్కడ పని చెయ్యకపోయినా ఎక్స్‌ట్రాడిషన్ ఆర్డర్స్ వచ్చేదాకా వాళ్ళను అనుసరించవచ్చు. తను డిటెక్టివ్ అని వాళ్ళు గ్రహించకపోవటం తన అదృష్టం అనుకొన్నాడు.

భాషీరతో మాట్లాడుతూ డిటెక్టివ్ ఫాక్స్, చిదానందం వెంట నడిచాడు.

"అదిసరే మిస్టర్ ఫాక్స్. ఇంతకీ మీరీ అమెరికా గడ్డ మీదకు ఎందుకొచ్చారో చెప్పలేదు" మళ్ళా అడిగాడు భాషీర.

"బిజినెస్ పనిమీద వచ్చానుగాని, మీ భూప్రదక్షిణ ఎంతవరకూ వచ్చింది?" అడిగాడు ఫాక్స్.

"ఇంకెంత. ఐపో వచ్చింది. మరో 36 రోజుల్లో

పూర్తయిపోతుంది" ఉత్సాహంగా చెప్పాడు భాషీర. డిటెక్టివ్ ఫాక్స్ భాషీరను వదిలి చిదానందం దగ్గర కెళ్ళాడు.

"సార్!" పిల్చాడు. అతని నోరు భగ్గుమంది. దొంగని తెలిసాక కూడా గౌరవించాలంటే బాధగా వుంది ఆ గూఢచారికి.

"చెప్పండి!" అన్నాడు చిదానందం అతనివైపు చూస్తూ. "మీరు ప్రపంచ ప్రదక్షిణ చేస్తూన్నట్లు మీ అనుచరుడు చెప్పాడు. నేనెలాగూ పని పూర్తి చేసుకొని ఇండియాకు తిరిగి వెళ్ళిపోదామనుకొంటూ కంపెనీ లేక ఆగిపోయాను. మీతో కలిసి రావటానికి మీ అభ్యంతరం వుండదనుకొంటాను," వినయంగా అడిగాడు.

"నో...నో...అటువంటిదేమీ లేదు మిస్టర్ ఫాక్స్. తప్పకుండా రండి," ముక్తసరిగా అంటూ రైల్వేస్టేషన్ లోనికెళ్ళి న్యూయార్కు పోయే రైలుగురించి వాకబు చేసాడు. మధ్యాహ్నం 3 గంటలకని తేలింది.

ముగ్గురూ నగరంలోనికి బయలుదేరారు. వారికున్న ఆరు గంటల సమయంలోనూ శాన్‌ఫ్రాన్సిస్కోలో చాలా వరకూ కలియతిరిగి పావుతక్కువ మూడు గంటలకు స్టేషన్ చేరుకొన్నారు.

సరిగ్గా మూడూ ఐదుకు రైలు 'ఓక్‌లాండ్' స్టేషన్‌ను వదిలింది. ఆ రైలు మార్గం పేరు పసిఫిక్. అది అమెరికా సంయుక్తరాష్ట్రాలను ఆ చివరినుంచి ఆ ఖండం వెడల్పంతో చెబుతుంది. దానికే మరో పేరు గ్రాండ్ ట్రంక్.

మొత్తం దాని నిడివి 3 వేల 7 వందల 86 మైళ్ళు. మొత్తం ఆ ప్రయాణం 7 రోజులు. ఈ రైలుమార్గం పోయే దారిలో చాలావరకూ రెడ్ ఇండియన్లనూ, క్రూర

జంతువులనూ చూడొచ్చు.

ఈ మార్గానే చిదానందం నవంబరు 26 వ తేదీకల్లా న్యూయార్కు చేరుకొని లివరుపూల్ స్టీమరుని అందుకోవాలి.

సాయంత్రం ఆరుదాటిన తర్వాతినుంచీ సన్నగా మంచు కురవటం ప్రారంభించింది. రైలును ఆపేపాటిది కాక పోయినా ధాటీగానే కురుస్తోంది. కిటికీలోంచి చూస్తోంటే తెల్లటి తెరవేసినట్లుంది.

ఆ దారిలో గుహాలుగాని, వంతెనలుగాని లేవు. అనవసరంగా అలాంటివి వెయ్యకుండా కొండలు పగులగొట్టకుండా దూరం అయినా సరేనని కొంచెం చుట్టుగానే వేశారు రైలుమార్గం.

మర్నాడు మధ్యాహ్నానికి రైలు హాంబోల్ట్ నదీ జన్మస్థలమైన హాంబోల్ట్ పర్వతశ్రేణిని దాటింది.

మిస్టర్ చిదానందం, భాషీరా, ఫాక్సులు భోజనాలు కానిచ్చి కిటికీలప్రక్క కూర్చొన్నారు. విశాలమైన పచ్చిక బైళ్ళు, దూరంగా దిగంతాన నీలగిరులు, అక్కడక్కడ కొండలపైనుంచి క్రిందకి ఉరుకుతున్న జలపాతాలూ, కన్పిస్తున్నాయి.

ఒకచోట అడవిదున్నల గుంపొకటి కన్పించింది. అవి జట్టుగా కలసి కట్టుగా పరుగులు పెడుతోంటే పెద్ద ఆనకట్ట ఏదో తరలిపోతోం దనిపించింది. ఆ ఆనకట్ట ఒక్కోసారి రైలుమార్గానికి అడ్డుపడటంకూడా జరుగుతుంది. అప్పుడిక అవి రైలుకట్ట దాటిపోయేదాకా చూస్తూ కూర్చోవటం తప్ప చేసేదేముండదు. ఒకోసారి అవి వేలకొలదీ కదలివస్తే తీరుబడిగా దాటడానికి గంటలకొరబడి పడుతుంది.

మొత్తం ఇప్పటికి శాన్ ఫ్రాన్సిస్కో నుంచి 1382 మైళ్ళు ప్రయాణంచేసి ఆ రైలుమార్గం మధ్యకు చేరుకొంది.

ఈ కనుమ ఎత్తు సముద్రమట్టానికి 8091 అడుగులు. మొత్తం ప్రయాణం ఇక్కడికి నాలుగు పగళ్ళూ, మూడు రాత్రులూ పట్టింది. మరో నాలుగు రాత్రులూ, మూడు పగళ్ళూ ఇదేవిధంగా ప్రయాణంచేస్తే న్యూయార్కుకి సకాలంలో చేరుకోగలుగుతాడు మిస్టర్ చిదానందం.

మర్నాడు ఉదయం 9 గంటలకు నార్త్‌ప్లాట్ స్టేషన్ దాటాక అనుకోని ప్రమాదం ఎదురయింది. అదే సియో ఇండియన్ల దోపిడీ!

దాదాపు 300 మంది సియో ఇండియన్ల దండు రైలును ముట్టడించింది. నడుస్తున్న రైలెక్కడం వారికి కొత్తేమీ కాదు. లోగడ చాలా రైళ్ళను వారు దోచుకొన్నారు.

ముట్టడి ప్రారంభమైన ఐదునిముషాల్లో ఆ ప్రదేశమంతా రణరంగంగా మారిపోయింది.

దాదాపు వందమంది పైగా సియో ఇండియన్లు రైళ్ళ పెట్టెలమీదికి దూకి ఎక్కిపోయారు. ప్రయాణీకుల దగ్గరి రివాల్వర్లు వాళ్ళ తుపాకులకు ఎదురు తిరిగాయి.

దండులోని కొందరు ముందర ఇంజన్ మీదికి దండెత్తి ఫైర్ మెన్‌నీ, ఇంజనీర్‌నీ తుపాకీతో కొట్టారు. వాళ్ళ నాయకుడు రైలాపాలన్న ఉద్దేశ్యంతో ఒక గొట్టం పట్టుకొని లాగాడు. అది ఆవిరిగొట్టాన్ని మూయటానికి బదులు ఇంకా తెరవటంతో రైలువేగం మరింత ఎక్కువై పోయింది.

'సియో'లు పెట్టెలమీదనుంచి తలుపులు బ్రద్దలు కొట్టుకొని లోనికి ప్రవేశించారు. అవకాశం వుంటే తుపాకీ కాల్చడం లేదా తిరగేసి మడమలతో చావబాదేయటం. దాదాపు బాహాబాహూ ముష్టియుద్ధం జరిగింది.

చిదానందం, మిస్టర్ ఫాక్స్, భాషీరలు రివాల్వర్స్‌తో ఫైరింగ్ ప్రారంభించారు. నిముషాల్లో పరిస్థితి ప్రమాదకరంగా మారింది. నష్టం సియోలకంటే ప్రయాణీకులకే ఎక్కువ తగులుతోంది. సామాన్లు కిటికీల్లోంచి బైటకు ఎగురుతున్నాయి.

చిదానందం ఆలోచించాడు. ఫోర్ట్ కియర్నీ స్టేషన్ మరో ఐదుమైళ్ళలో ఉంది. రైలు ఎలాగైనా అక్కడికి చేరేలోగా ఆగితే స్టేషన్‌లో వుండే సైనిక దళం రక్షిస్తుంది. ఒకవేళ రైలు ఆగక ఆ స్టేషన్ దాటి ముందుకు పోతే తర్వాతి స్టేషన్ వరకూ ప్రయాణీకులకు రక్షణ దొరకదు.

భాషీరవైపు తిరిగి చేయవలసింది చకచకా చెప్పాడు. తలూపి ముందుకు పరిగెత్తాడు భాషీర. మొదటి కంపార్టుమెంట్ నుంచి చివరి కంపార్టుమెంట్ వరకూ దారి ఉండటం వలన అడ్డువచ్చిన సియోలను కాల్చుకొంటూ పోయి ఇంజన్ దగ్గరకు చేరుకొన్నాడు.

తలుపులు వేసి నెమ్మదిగా పెట్టె అడుగుకి జారుతోంటే కళ్ళు తిరిగాయి వేగానికి. సియోలు కాలుస్తున్న తుపాకీ గుళ్ళు తలపైనుంచి ఎడాపెడా దూసుకుపోతోన్నాయి.

జాగ్రత్తగా పాకుతూ వెళ్ళి పెట్టె అంచుకు వ్రేళ్లాడుతూ కప్లింగ్ అతి కష్టంమీద ఊడదీసాడు.

అక్కడితో ఇంజన్‌కూ, మిగిలిన పెట్టెలకూ లంకె తెగి పోయింది. కాని అప్పటివరకూ పరిగెత్తిన వేగం ఊపు వలన పెట్టెలు కూడా చాలా దూరం పరిగెత్తి నెమ్మదిగా వేగం తగ్గుతూ కొద్ది నిముషాల్లో ఫోర్ట్ కియర్నె స్టేషన్‌కు వందగజాల దూరంలో ఆగిపోయాయి పెట్టెలు.

తుపాకీ కాల్పులు విని స్టేషన్‌నుంచి సైనికులు పరిగెత్తు కొచ్చారు. కాని సియో ఇండియన్సు రైలు పూర్తిగా ఆగకుండానే క్రిందకి దూకి పరుగు లంకించుకొని క్షణాల్లో మాయం అయ్యారు.

ప్రయాణీకులంతా ఉన్నారో, లేదో అని లెక్క చూసుకోగా చాలామంది కన్పించలేదు. రైలును ఆపి అంతమందిని రక్షించినందుకు అక్కడి సైనికదళాధిపతి భాఘీరను అభినందించాడు. కాని భాఘీర మనసంతా అక్కడ లేదు.

'పెట్టెలను వదిలి ముందుకు వెళ్ళిపోయిన ఖాళీ ఇంజన్ తిరిగి వెనక్కి ఎప్పుడొస్తుంది? అసలు వస్తుందా? రాదా? మరయితే ఇప్పుడు తమ ప్రయాణం ఎలా?' విపరీతంగా ఆలోచిస్తున్నాడు.

తర్వాతి రైలెప్పుడో కనుక్కొన్నాడు చిదానందం. మర్నాడు సాయంత్రం 'సార్ట్ శాండర్స్'నుంచి ఒమాహా వెళ్ళే రైలునుందని తెల్సింది.

12

"ఓహో! అలాగా!" అన్నాడు ముక్తసరిగా.

పది నిముషాల తర్వాత బైటినుంచి డిటెక్టివ్ ఫాక్స్ స్టేషన్‌లోకి వచ్చాడు. అతని ముఖంలో కొంచెం ఉత్సాహం కన్పిస్తోంది.

నెమ్మదిగా చిదానందం దగ్గరకి వెళ్ళాడు.

"నిజంగా చెప్పండి. నిజంగా మీరు త్వరగా వెళ్ళాలా?" అని అడిగాడు ముఖంలోకి చూస్తూ.

"అక్షరాలా!" అన్నాడు ముక్తసరిగా చిదానందం.

"నవంబరు 26వ తేదీ రాత్రి 9 గంటలకు బయలుదేరే లివర్‌పూల్ స్టీమరు అందుకోవాలి. అంతే కదూ?"

"ఖచ్చితంగా అంతే!"

"అయితే ఓ ఉపాయం ఉంది. ప్రయత్నిస్తారా?"

"ఏమిటది? కాలినడకా?"

"కాదు. స్లెడ్జ్ బండిమీద."

చిదానందం మాట్లాడలేదు. ఫాక్స్ స్లెడ్జి బండి యజమాని దగ్గరకు తీసుకెళ్ళాడు. అక్కడ విచిత్రంగా వున్న స్లెడ్జిబండి కన్పించింది.

రెండు దుంగలమీద ఒక చట్రం బిగించబడి వుండి ఆ చట్రం ముందు భాగం కొంచెం పైకి వంపుతిరిగి వుంది. చట్రంపైన అయిదు, ఆరుగురూ కూర్చొనే వసతి వుండి అది నడవటానికి తెరచాపలు కట్టబడి వున్నాయి. (కొన్ని చోట్ల కుక్కలతో కూడా వాటిని లాగిస్తారు.) వెనక చుక్కానిలాంటిది ఏర్పాటు చేశారు.

ఐదు నిముషాల్లో బేరం కుదిరిపోయింది. 200 మైళ్ళ దూరంలో వున్న ఒమాహా చేర్చడానికి 500 పౌండ్లకి ఒప్పుకొన్నాడు స్లెడ్జిబండి యజమాని మిడ్జి.

మధ్యాహ్నానికి స్లెడ్జిబండి సిద్ధం చెయ్యబడింది. శీతాకాలంలో మంచు గడ్డకట్టుకుపోయి రైలుపట్టాలు కప్పబడి పోయినప్పుడు ఈ స్లెడ్జిబళ్ళే ప్రయాణీకులకు ఉపయోగిస్తాయి. మంచుమీద తెరచాపలనిండా గాలిపోసుకొని

ఈ బళ్ళు వేగంగా పోతాయి. వాటి వేగం సముద్రం మీద వేగంగా పోయే కట్టర్ నావలను మించివుండి, గాలి వీలుగా వుంటే ఎక్స్‌ప్రెస్ ట్రైనును మించక పోయినా అంత వేగంగా పోతాయి.

చిదానందం బృందం ఓవర్ కోట్లు కప్పుకొని ముడుచుకు కూర్చొన్నారు.

స్లెడ్జి తెరచాపలు విచ్చుకొని బయలుదేరి క్రమంగా గాలి పుంజుకొని గంటకు యాభై మైళ్ళ వేగంతో ప్రయరీ బయళ్ళ మంచు నేలమీద పోసాగింది. స్లెడ్జిబండి పోతోన్న వేగానికి చలిగాలి చీలి రంపపుకోత పెడుతోంది. యజమాని 'మిడ్జి' స్లెడ్జి తిరిగిపోకుండా ఒడుపుగా చుక్కాని పడుతూ తిన్నగా నడపసాగాడు.

ప్రయరీ బయలు గెడ్డకట్టిన సముద్రంలా వుంది. డొంక తిరుగుడు మాని అడ్డదారి పట్టించాడు మిడ్జి. దారిలో మిట్ట పల్లాలూ, డొంకలూ, చెట్లూ ఏమీ కన్పించటంలేదు.

ప్రమాదం సంభవించటానికి రెండే రెండు అవకాశాలున్నాయి. ఒకటి స్లెడ్జి విరిగిపోవటం. రెండు గాలి తగ్గిపోవటం.

స్లెడ్జి ముందూ వెనకా ఏమీ లేదన్నట్లుగా వేగంగా పోసాగింది. అంతా అఖండ హిమఖండలాగానూ, ధ్రువం లాగానూ తోచింది చిదానందానికి.

అక్కడక్కడా అస్థిపంజరాలలాగ కన్పిస్తున్న చెట్లు మెరుపుల్లా మాయమవుతున్నాయి. అప్పుడప్పుడూ పిట్టల బారులు ఎక్కడినుంచో లేచి చూస్తూండగానే దిగంతంలో మాయమౌతున్నాయి.

అక్కడక్కడా మంచులో డేళ్ళు కన్పించాయి.

మందలు మందలుగా తిరుగుతున్న అవి స్లెడ్జిబండిని, దాని మీద మనుషుల్ని చూడగానే కూతబెట్టి వెంట తరిమేవి.

ఆకలితో క్రూరంగా చూస్తూ తరుముతున్న ఆ తోడేళ్లు గాని స్లెడ్జిబండిని చేరగలిగితే ఏం జరుగుతుందో తెలిసిన భాషీర పిస్తోలు పట్టుకొని కూర్చొన్నాడు. మైళ్ళకొద్దీ వెంటబడి తరిమే ప్రయరీ తోడేళ్ళు అలిసిపోయి స్లెడ్జిను అందుకోలేక క్రమంగా వెనకబడిపోయేవి.

సాయంత్రం నాలుగు గంటలకు స్లెడ్జి ప్లాట్ నదిని దాటి ఒమాహాకు 20 మైళ్ళ దూరానికి వచ్చింది. మరో అరగంట తర్వాత మంచుతో కప్పబడిన ఇళ్ళు కనపడగానే తెరచాపలు దించేశాడు మిడ్జి.

చిదానందం బండి దిగి 'మిడ్జి'కు 500 పౌండ్లు రుసుముతోబాటు 200 పౌండ్లు బహుమతి కూడా ఇచ్చాడు.

స్టేషన్‌లో 'షికాగో' వెళ్ళే బండి సిద్ధంగా వుంది. చిదానందం బృందం ఎక్కిన మరో అరగంటకు బయలుదేరి 'అయోవా' రాష్ట్రంగుండా పోయి ఆ రాత్రి 'డాలెన్ పోర్టు' దగ్గర 'మిసిసిపీ' నదిని దాటి 'రాక్ ఐలెండ్'వద్ద 'ఇలినాయ్' రాష్ట్రంలో ప్రవేశించింది. మరునాడు సాయంత్రం మూడు గంటలకు షికాగో చేరుకోగానే చిదానందం బండి మారాడు. అక్కడినుండి న్యూయార్కు 900 మైళ్ళు.

న్యూయార్కు పోయే రైలు 'ఇండియానా', 'ఓహియో' రాష్ట్రాలగుండా పోయి ఓహియో పట్టణాన్ని దాటి నవంబరు 26వ తేదీ రాత్రి ఎనిమిది గంటల ముప్పై ఐదు నిముషాలకు జర్సీ నగరం చేరింది.

న్యూయార్కు వ్యాపారమంతా ఇక్కడి 'హాడ్సన్'

నదీ తీరాన్న వున్న రేవుల ద్వారానే జరుగుతోంది.

ఆ రాత్రి అంటే 26వ తేదీ రాత్రి 9 గంటల 33 నిముషాలకు చిదానందం, భాష్కర, డిటెక్టివ్ ఫాక్స్‌లను ఎక్కించుకొని 'లివర్‌ఫూల్'కు బయలుదేరింది స్టీమరు "చైనా".

13

డిసెంబరు 6వ తేదీన లండన్ చేరుకోవలసిన మిస్టర్ చిదానందంతో లివర్ ఫూల్‌నుంచి బయలుదేరిన రైలు డిసెంబరు 5వ తేదీకే లండన్ చేరుకొంది. ఈ ప్రయాణంలో అట్లాంటిక్ సముద్రం శాంతంలో ఫసిఫిక్‌కు ఏ మాత్రం తీసిపో నన్పించుకొని 'చైనా' స్టీమరుకు 20 గంటలు ఆదా చేసింది.

లండన్‌నుంచి ట్రెన్‌లో 'డోవర్' వరకూ వెళ్ళి అక్కడినుంచి స్టీమ్ బోటులో 'డోవర్ జలసంధి' దాటి 'పారిస్' మీదుగా ఐరోపాకు అడ్డుపడి 'రోం' నుంచి మధ్యధరా సముద్రంలో ప్రవేశించి ఒకరోజు ఆలశ్యంగా డిసెంబరు 12వ తేదీన సూయజ్ చేరుకొన్నారు చిదానందం బృందం.

'అట్లాంటిక్' ప్రయాణంలో మిగిలిన ఒక రోజూ ఇందులో కవరయిపోయింది.

అంతే కాకుండా మరో గట్టిదెబ్బ తిన్నాడు చిదానందం అక్కడే. ఫ్రెంచి స్టీమరు 'సికియర్' సూయజ్‌కు చేరుకొన్న తర్వాత రెండు గంటలకు బయలుదేరవలసిన బొంబాయి నౌక 'రంగూన్' కొన్ని కారణాలవలన ఒక రోజు ముందుగానే వెళ్ళిపోవటం జరిగింది.

రంగూన్ నౌక తప్పిపోయిందని తెలియగానే కుప్ప కూలిపోయాడు ఖాఫీర. ఆ రోజు డిసెంబరు 12వ తేదీ, ఇంక మిగిలింది 13 రోజుల 8 గంటలు మాత్రమే. ఆలోగా బొంబాయి చేరుకొని లయన్సు క్లబ్బులో హాజరు కావాలి మిస్టర్ చిదానందం.

న్యాయంగా రంగూన్ నౌక అసలు సమయానికేగాని బయలుదేరి వుంటే ఖచ్చితంగా డిసెంబరు ఇరవై ఐదవ తేదీకల్లా ప్రపంచ ప్రదక్షిణ పూర్తిచేసి వుండేవాడు చిదానందం.

కాని చివరి దశలో విధి అతనికి మరోసారి ఎదురు తిరిగింది క్రూరంగా.

మాట్లాడకుండా ఊళ్ళోకి బయలుదేరి సాయంత్రం దాకా ఒక హోటల్లో విశ్రాంతి తీసుకొన్నాడు మిస్టర్ చిదానందం తన అనుచరులతో.

ఐదు గంటలకు మాత్రం తనొక్కడే బయలుదేరి హార్బరులోకి వెళ్లాడు. అతను వెళ్ళేసరికి హార్బరులో ప్రయాణానికి సిద్ధంగా వున్న ఒక సరకుల నౌక కన్పిం చింది. వెంటనే ఒక పడవ చేసుకొని దాని దగ్గరకు వెళ్ళాడు చిదానందం.

దాని పేరు హెన్రీయెట్టా. ఇనుపరేకులతో కట్టు దిట్టంగా వుండి పైభాగంలో చెక్క వేయబడింది. చిదా నందం స్టీమరు పైకెళ్ళి కెప్టెన్‌ను కలుసుకొన్నాడు. అతను నడివయస్సు వ్యక్తి. చాలా కోపిష్టిలా కన్పిస్తు న్నాడు ఎర్రగా ఉండి. అతని జుట్టు కూడా ఎర్రగా వుంది.

భారీ విగ్రహం. విశాలమైన ఛాతీ. మనిషి మాత్రం కొట్టొచ్చేట్టున్నాడు.

"మీరేనా కేప్టెన్?" అడిగాడు చిదానందం.

"అవును. నేనే!"

"నా పేరు చిదానందం... మాది ఇండియా."

"ఊ... నా పేరు ఆండ్రూస్పీడీ!"

"స్టీమరు ఒదలబోతున్నారా?" అడిగాడు.

"ఇంకో గంటలో!"

"ఎందాకా?"

"మస్కట్... అరేబియా!"

"స్టీమరు వేగంగా పోతుందా?"

"పదీ, పదకొండు నాట్‌లు పోతుంది. హెన్రీయెట్టాను గురించి ఎవర్నడిగినా చెప్తారు."

రెండు నిముషాలు ఊరుకొని సిగార్ వెల్గించుకొంటూ అడిగాడు చిదానందం.

"నన్ను బొంబాయి వరకూ తీసుకుపోతారా? నాతో పాటు మా వాళ్ళిద్దరున్నారు."

"బొంబాయా? నయం చైనా రమ్మన్నారు కాదు."

"ఎంత డబ్బిచ్చినా రారా?"

"ఆహా ఎంతిచ్చినా రాను."

వాడి వరుస చూస్తోంటే నిజంగానే డబ్బుకి లొంగే టట్లు లేదనిపించింది చిదానందంకి.

"సరే లెండి. ఈ స్టీమరు సొంతదారు..."

"నేనే!"

"అమ్ముతారా? కొంటాను."

"అమ్మను."

"పోనీ కిరాయి కిస్తాం? సరుకె త్తిస్తాను."

"ఊహూ... ఇవ్వను."

చిదానందంకి ఏం చెయ్యాలో తోచలేదు. వాడి మొండితనం చూస్తుంటే చిరాకు పుడుతోంది.

"పోనీ మిస్కట్ తీసుకుపోతారా?"

"వీల్లేదు. వెయ్యి డాలర్లిచ్చినా సరే!" లేస్తూ అన్నాడు కేప్టెన్.

"పోనీ ఐదువేల డాలర్లయితే?"

"ఏమిటి? ఒక్కొక్కరికీనా?"

"అవును. ఒక్కొక్కరికీనే?"

"సరే అయితే, మరో గంటలో స్టీమర్లో ఉండాలి."

"అలాగే. థాంక్స్!" అంటూ స్టీమరు దిగి హార్బరులోకి వెళ్ళిపోయాడు పడవలో.

తిన్నగా హోటల్ కి వెళ్ళి డబ్బు చెల్లించి, భాషీరా, ఫాక్స్ లతో హెన్రీయెట్టా పైకి చేరుకొన్నాడు.

మరో పావుగంటలో సరుకెత్తడం పూర్తిచేసి బయలుదేరింది హెన్రీయెట్టా.

చిదానందం ఆండ్రూస్పీడీకి డబ్బు చెల్లిస్తుంటే బాధగా కేకేసాడు భాషీర. ప్రాణం ఉసురుమంది డిటెక్టివ్ ఫాక్స్ కు.

ఆ మర్నాడు డిసెంబరు 13వ. తేదీ ఉదయం సూర్యోదయం వేళ హెన్రీయెట్టా మీద కేప్టెన్ కూర్చొనేచోట ఒక వ్యక్తి కూర్చొని నౌకను నడిపిస్తున్నాడు. పరిశీలనగా చూస్తే ఆ వ్యక్తి మిస్టర్ చిదానందం అని తెలుస్తుంది. ఆ సమయంలో కేప్టెన్ ఆండ్రూస్పీడీ ఒక గదిలో బంధించబడి విలపిస్తున్నాడు. హెన్రీయెట్టాని పూర్తిగా చిదా

నందం స్వాధీన పరచుకొని నడిపిస్తున్నాడు.

అసలు జరిగిందేమిటంటే చిదానందం బొంబాయి వెళ్ళాలనుకొన్నాడు. కాని స్పీడీ డబ్బు తీసుకొని కూడా అందుకు ఒప్పుకోకపోవటంతో అతన్ని గదిలో బంధించి నౌకను స్వాధీన పర్చుకొన్నాడు చిదానందం. నావికులకూ, కళాసులకూ బాంకు నోట్లిచ్చి తనవైపుకు త్రిప్పుకొని సమర్థవంతంగా కేప్టెన్ బాధ్యతను నిర్వహిస్తూ బొంబాయి వైపు పోనిస్తున్నాడు హెన్రీయెట్టాను.

డిసెంబరు 19 వ తేదీని చిదానందం తన డైరీని తిరుగు వేసాడు. అది తను ప్రయాణం ఆరంభించిన 74 వ రోజు. ఇంక ఆరురోజులలో తను బొంబాయి చేరుకోవాలి. స్టీమరు తన అధీనంలో వుంది గనుక సమయానికి చేరుకోగలననే నమ్మకం ఉందతనికి.

డిసెంబరు 22 వ తేదీన స్టీమరు ఇంజనీర్ డెక్ మీదకు వచ్చి బొగ్గు అయిపోయిందన్న విషయాన్ని తెల్పాడు. ఎందుచేతనంటే ఓడలో మస్కాట్ వరకూ పోవటానికి సరిపోయిన బొగ్గే నింపుకోవటం జరిగింది. మస్కాట్ కంటే బొంబాయి దూరం అవటంవలన చాలలేదు.

"ఇక్కడికి దగ్గరలో ఇండియాకు సంబంధించిన రేవేదైనా ఉందేమో చెప్పగలరా?" అడిగాడు చిదానందం ఆలోచిస్తూ.

"బాగా దగ్గరలోవున్నది పోర్ బందర్ మాత్రమే. అదీ కూడా రెండురోజులు పడుతుంది."

14

చిదానందం భాషీరను పిల్చి ఆండ్రూ స్పీడీని విడిచి పెట్టెయ్యమని చెప్పాడు. ఐదునిమిషాల్లో కేప్టెన్ స్పీడీ

కోపంతో కళ్ళెర్రచేసి చిదానందంని తిడుతూ డెక్ మీద కొచ్చాడు.

వచ్చీ రాగానే "నా ఓడను ఎక్కడికి తీసుకు పోతున్నావ్?" అని అరిచాడు.

"మహానుభావా! మీ స్టీమరు ఇండియా తీరానికి చాలా వేగంగా పోతోంది" అన్నాడు చిదానందం.

"నువ్వు దొంగ వెధవ్వి, నోర్ముయ్!"

"ఇంతకీ విషయం తమతో..."

"సిగ్గుచేటు, బందిపోటు వెధవ...బద్మాష్!"

"క్షమించండి! మీకు శ్రమ ఇచ్చిన కారణం మీ నౌక అమ్ముతారేమోనని అడగటానికి."

"చచ్చినా అమ్మను నీలాంటి సముద్రపు దొంగకి."

"అయితే మీ నౌకలో కొంత భాగం తగులబెట్ట బోతున్నందుకు క్షమించండి."

"ఏమిటీ? నా ఓడకు నిప్పంటిస్తావా? రాస్కెల్!" చిదానందం మీదకు దూకబోయాడు ఆంద్రూ స్పీడీ. కాని ప్రక్కనేవున్న భాఫీర వేగంగా కదిలి గట్టిగా పట్టుకొన్నాడు.

"నౌకలో భాగ్గయిపోయింది."

"అందుకని? నా లక్షా ఎనభైవేల రూపాయల నౌకను తగులబెడతావా?" అన్నాడు స్పీడీ ఒగర్చుతూ.

"దాని ఖరీదు 2 లక్షల రూపాయలిస్తాను సమ్మతమేనా?" అంటూ సంచిలోంచి రెండులక్షల రూపాయల నోట్ల కట్టలు తీసి కేప్టెన్ స్పీడీ చేతిలో పెట్టాడు. ఆ డబ్బు చూడగానే కేప్టెన్ కోపం మాయమైంది.

"ఈ ధరకు సంతోషంగా అంగీకరిస్తున్నాను"అన్నాడు

పరమానందంతో స్పీడీ.

వెంటనే చిదానందం నాకలోని కళాసీలను పిల్చి స్టీమరు పై భాగాన్నంతా నరికి బాగుగా ఇంజన్‌కు వాడమని ఆజ్ఞాపించాడు. మరో రెండురోజులకల్లా ప్రయాణంతోపాటు డెక్ అంతా నరకటం అయిపోయింది.

డిసెంబరు 24 వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు స్టీమరు ఇండియా తీరానున్న పోర్‌బందర్ రేవు చేరుకొంది.

కేప్టెన్ అండ్రూ స్పీడీ ఓడపైనుంచి చిదానందంని ఆప్యాయంగా సాగనంపాడు. చిదానందం మిగిలిన ఓడను అతను తీసుకుపోటానికి అనుమతినిచ్చాడు.

చిదానందం, భాక్షీరలు డిటెక్టివ్ ఫాక్స్‌తో కలిసి చిన్న పడవలో అరగంట తర్వాత పోర్‌బందర్ హార్బర్లో ఇండియా గడ్డపై అడుగుపెట్టారు.

డిటెక్టివ్ ఫాక్స్ చిదానందం భుజంపై చెయ్యివేసి, "మిస్టర్ చిదానందం మీరేనా?" అన్నాడు.

"అవును. నేనే! ఏమిటి సంగతి?" అడిగాడు చిదానందం ఆశ్చర్యంగా ఫాక్స్‌వైపు చూస్తూ.

డిటెక్టివ్ ఫాక్స్ వారంట్ చూపించి "నేను మిమ్మల్ని అరెస్టు చేస్తున్నాను," అన్నాడు హుందాగా.

15

ఆ రాత్రంతా చిదానందం కస్టమ్స్‌వారి ఖైదులోనే ఉన్నాడు. మర్నాడు బొంబాయి తీసుకుపోవటానికి సన్నాహాలు చేస్తున్నాడు ఫాక్స్.

చిదానందంను అరెస్టు చేస్తోంటే ప్రక్కనేవున్న భాక్షీర ఒక్కసారి ఉద్రేకంతో ఎగిరి ఫాక్స్‌ను తన్నబోయాడు కాని, అప్పుడే వచ్చిన పోలీసులు అతన్ని

రెక్కలు విరిచి పట్టుకొన్నారు. హఠాత్తుగా వచ్చిన ఈ ఉపద్రవానికి చిదానందం తెల్లబోయాడు.

నిస్పృహతో కుప్పకూలిపోయిన భాఫీర ఆ రాత్రంతా కస్టమ్స్ హౌస్ వసారాలోనే కురుస్తున్న చలినీ, వేస్తున్న బాధనూ సహిస్తూ కూర్చుండిపోయాడు.

గమ్యం చేరి ఆఖరి అడుగు వేస్తోండగా కాలు జారి పోయినట్లయింది చిదానందం పని. 25 వ తేదీ రాత్రి 9 గంటల 18 నిముషాల లోపల బొంబాయి చేరాలంటే ఆ రోజు ఉదయం 7 గంటలకు బయలుదేరుతూన్న ఎక్స్ప్రెస్‌ను అందుకోవాలి.

ఇప్పుడీ బంధిఖానా మూలంగా ఆ అవకాశం కాస్తా జారిపోయింది.

ఉదయం ఆరున్నరగంట కొట్టింది కస్టమ్స్ హౌస్ గడియారం. ఇంకో అరగంటే వుంది. ఈ పాటికి అవతలపడి రైలు చేరుకొన్నా చాలు, రాత్రి 9 గంటలకల్లా బొంబాయి చేరుకోవచ్చు. చిదానందం ముఖంలో చిరాకు తొంగి చూసింది.

సరిగా ఆరు నలభైయిదుకు తలుపుదగ్గర చప్పుడైంది. భాఫీరా, డిటెక్టివ్ ఫాక్స్‌ల మాటలు విన్పిస్తున్నాయి. చిదానందం ముఖంలో ఆశ లీలగా కదులాడింది.

తలుపులు తెర్చుకోగానే ఫాక్స్, భాఫీరలు లోనికి వచ్చారు. ఫాక్స్ ముఖంలో కంగారు కన్పిస్తోంది. జుట్టు కొద్దిగా రేగివుండి నోటమ్మట మాట పెగలటం లేదు. తలొంచుకొంటూ అన్నాడు గబగబా చివరికి.

"సారీ సార్. మూడురోజుల క్రితమే అసలు దొంగ దొరికాడంట. వేధవ పోలిక మూలంగా మిమ్మల్ని

అనుమా...మీరు...మీరు వెళ్ళిపోవచ్చు..." అన్నాడు తొట్రుపడుతూ.

చిదానందం నెమ్మదిగా లేచి నిలబడి డిటెక్టివ్ ఫాక్స్ దగ్గరకు నడిచాడు. చెయ్యి విసురుగా వెనక్కిలాగి మరు క్షణంలో రెట్టింపు వేగంతో ముఖంమీద కొట్టాడు.

డిటెక్టివ్ ఫాక్స్ ఎగిరి మూలపడ్డాడు.

అతనివైపు చూసే తీరిక కూడా లేక బైటకి దూకి టాక్సీలో స్టేషన్‌కు బయలుదేరారు ఇద్దరూ. వాళ్ళు చేరు కొనేసరికి కొద్ది నిముషాల ముందే బొంబాయి వెళ్లే ట్రైన్ వెళ్ళిపోయిందని తెల్సింది.

రెండు నిముషాలు స్థిరంగా ఆలోచించి స్టేషన్ బైట కొచ్చాడు చిదానందం భాఫీరతో. అరగంటలో ఒక టాక్సీని వెయ్యి రూపాయలకు కుదుర్చుకొని బయలుదేరారు ఇద్దరూ బొంబాయికి.

అనుకున్న సమయానికి అరగంట ముందుగానే బొంబాయి చేర్చాడు డ్రైవరు. అతనికి మరో వెయ్యి రూపాయలు బోనస్ చెల్లించి విజయోత్సాహంతో లయన్స్ క్లబ్‌లోకి అడుగుపెట్టాడు మిస్టర్ చిదానందం.

(ఆంగ్ల నవల 'అరౌండ్ ది వరల్డ్ ఇన్ 80 డేస్' ఆధారంగా.)

—: ఐపోయింది :—